# విశాల భారతి

తెలుగు దినపత్రిక

27-02-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 55


## ప్రభుత్వ స్వీపర్ నెల జీతం రూ. 2 లక్షలు



- తెలంగాణ విద్యుత్ శాఖలో సీనియర్ స్వీపర్ నెల జీతం రూ. 2 లక్షలు
- పదేళ్ల సర్వీస్ ఉన్న ఐఏఎస్ అధికారుల వేతనం కంటే ఇదే ఎక్కువ
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెల్లడించిన సంచలన గణాంకాలు
- 2014తో పోలిస్తే జీతాలు, పెన్షన్ల ఖర్చు 300 శాతం పెరుగుదల
- మున్సిపల్ శాఖలోనూ భారీగా పెరిగిన పారిశుధ్య కార్మికుల వేతనాలు
- వరుస పీఆర్సీలు, ఎన్నికల హామీల వల్లే వేతనాల మోత

04

# ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ వెలుగులు

### ప్రభుత్వ పాఠశాలల్లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ స్థాయి వసతులు

- విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ బస్సుల రవాణా సౌకర్యం
- బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో విజయా డైరీ పాల పంపిణీ తప్పనిసరి
- మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలనకు ఏఐ టెక్నాలజీ వాడకం
- ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తే గుర్తింపు రద్దు
- నియోజకవర్గానికి ఒక 'ఆరుట్ల' తరహా మోడల్ స్కూల్ ఏర్పాటు



**తెలంగాణ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. బడ్జెట్ కేటాయింపులు కేవలం అంకెలకు పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి అనుభూతిని అందించాలని ఆయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్‌లోని ప్రభుత్వ పాఠశాలలు చూస్తే, అవి ప్రైవేట్ విద్యా సంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఐసీసీసీ వేదికగా జరిగిన విద్యాశాఖ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడిన తీరు, విద్యారంగంపై ఆయనకున్న స్పష్టమైన విజన్‌ను చాటిచెబుతోంది.**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని సీఎం సూచించారు. నగరంలోని పేరుగాంచిన భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ వంటి విద్యాసంస్థల్లో ఎటువంటి వసతులు ఉన్నాయో, అవే సౌకర్యాలు నిరుపేద విద్యార్థులు చదువుకునే సర్కారు బడుల్లోనూ ప్రతిబింబించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. మౌలిక సదుపాయాల కొరత కారణంగా ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించిన సీఎం, బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఉదయం పాఠశాలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా పాలను తప్పనిసరిగా చేర్చాలని, ఇందుకోసం ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయా డైరీ నుంచి మాత్రమే పాలను సేకరించాలని సూచించారు. దీనివల్ల అటు విద్యార్థులకు స్వచ్ఛమైన పాలు అందుతాయని, ఇటు ప్రభుత్వ డైరీకి కూడా చేయూత లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థుల కడుపు నింపే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యా వ్యవస్థలో మేళవించేలా రేవంత్ రెడ్డి వినూత్న ఆలోచనలు చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించాలని ఆయన సూచించారు. వంట తయారీ నుంచి విద్యార్థులకు వడ్డించే వరకు ప్రతి దశలోనూ నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఏఐ పర్యవేక్షణ ఉండాలని భావిస్తున్నారు. ఈ సాంకేతికత ద్వారా భోజనం నాణ్యతలో లోపాలను తక్షణమే గుర్తించి సరిదిద్దే అవకాశం ఉంటుందని, ఇది విద్యార్థుల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఇబ్బందులను గమనించిన సీఎం, రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా ఇతర నియోజకవర్గాల్లో ఒక్కో మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో పైలట్ ప్రాజెక్టును చేపట్టాలని ఆదేశించారు. దూరం భారమై పాఠశాలలకు రాలేకపోతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశపెట్టే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను కోరారు. పర్యావరణ హితమైన ఈ బస్సులు విద్యార్థులను సురక్షితంగా పాఠశాలలకు చేర్చడమే కాకుండా, ప్రయాణ భారాన్ని కూడా తగ్గిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

మిగతా 3లో..

### భారత్-ఇజ్రాయెల్ స్నేహం

# ఇక 'స్పెషల్'

- ఇరుదేశాల బంధం ఇకపై 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం'.
- త్వరలోనే భారత్-ఇజ్రాయెల్ మధ్య ఎఫ్‌టీఏ ఒప్పందం ఖరారు
- ఇజ్రాయెల్‌లోనూ మన డిజిటల్ చెల్లింపుల విప్లవం.. కుదిరిన ఒప్పందం
- ఏఐ, సెమీ కండక్టర్లు, అంతరిక్ష రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయం
- రాబోయే ఐదేళ్లలో 50 వేల మంది భారతీయులకు ఇజ్రాయెల్‌లో ఛాన్స్
- సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల సంఖ్య 43 నుండి 100కు పెంపు




**విశాలభారతి, అంతర్జాతీయం:**

భారత్, ఇజ్రాయెల్ దేశాల మధ్య స్నేహబంధం సరికొత్త శిఖరాలను తాకింది. చారిత్రక జెరూసలెం నగరం వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూల మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చలు ఇరుదేశాల భవిష్యత్తును మార్చేలా సాగాయి. దశాబ్దాలుగా ఉన్న నమ్మకాన్ని, ప్రజాస్వామ్య విలువలను పునాదిగా చేసుకుని, తమ బంధాన్ని 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు మోదీ ప్రకటించారు. కాలపరీక్షకు నిలబడిన ఈ స్నేహం, ఇప్పుడు ఆధునిక సాంకేతికత, రక్షణ మరియు వాణిజ్య రంగాల్లో ప్రపంచానికే ఆదర్శంగా నిలవబోతోంది.

మిగతా 3లో..

### పేదల గూడు కూల్చడం

# ఇందిరమ్మ రాజ్యమా?



- ఖమ్మం వెలుగుమట్లలో బాధితులకు కేటీఆర్ భరోసా
- 4వేల మంది పోలీసులతో దండయాత్ర చేయడమేంటి?
- ముగ్గురు మంత్రుల కన్ను ఆ 60 ఎకరాలపైనే
- అధికారిని బలిపశువు చేసి తప్పించుకోవాలని చూస్తున్నారు
- బీఆర్ఎస్ రాగానే మళ్ళీ ఇక్కడే ఇళ్లు కట్టిస్తాం
- అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ సర్కార్‌ను ఎండగడతాం

**విశాలభారి, స్టేట్ బ్యూరో:**

ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలో బుల్డోజర్లు చేసిన గాయం రాజకీయ రణరంగంగా మారింది. భూదాన్ భూముల ముసుగులో పేదల ఇళ్లను నేలమట్టం చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాధితుల కళ్ళల్లో నీళ్లు చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని

మిగతా 3లో..

### కలెక్టర్ బదిలీ.. గిరిజనుల సంబరాలు

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ బదిలీపై జిల్లాలో హర్షా తిరేకాలు
- జిల్లా అభివృద్ధిని పదేళ్లు వెనక్కి నెట్టారని గిరిజన సంఘాల ధ్వజం
- నిధులను ఖర్చు చేయకుండా ప్రభుత్వానికి తిప్పి పంపడంపై మండిపాటు
- ధరణి, పట్టాదారు పాసుపుస్తకాల పరిష్కారంలో పూర్తిగా విఫలం
- ప్రజాప్రతినిధుల ఆదేశాలను సైతం బేఖాతరు చేశారన్న విమర్శలు
- జిల్లా కష్టాలను తీర్చే సమర్థుడైన అధికారి రావాలని ప్రజల ఆకాంక్ష

03

# ఇళ్లపై రాజకీయం

- గత బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల పేరిట భారీ దోపిడీ
- రూ. 1.08 లక్షల కోట్లు ఖర్చు చేసినా దక్కింది 110 టీఎంసీలే
- ఎన్నికల ముందే కుంగిన బ్యారేజీలు.. పాలకుల తప్పిదమే
- బీఆర్ఎస్, బీజేపీల మధ్య 'ఫెవికాల్ బంధం' బహిరంగ రహస్యం
- కేటీఆర్, హరీశ్ రావు వ్యాఖ్యలు వాస్తవ దూరం
- గత తప్పిదాలను సరిదిద్ది సాగునీరు అందించడమే ధ్యేయం



02

### ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంపై సుప్రీం సీరియస్

- ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి వివాదాస్పద పాఠ్యాంశంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్రగా పరిగణించిన ధర్మాసనం
- ప్రతులను, డిజిటల్ ప్రింట్‌లను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆదేశం
- విద్యాశాఖ కార్యదర్శి, ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు షోకాజ్ నోటీసులు జారీ
- క్షమాపణలు కోరిన కేంద్రం.. శాంతించని సర్వోన్నత న్యాయస్థానం
- తదుపరి విచారణ మార్చి 11కి వాయిదా వేసిన ధర్మాసనం

02

### ఇసుకలో నడకతో ఆరోగ్యం

- సాధారణ నేల కంటే రెండింతలు ఎక్కువ కండరాల కసరత్తు
- కీళ్ల పై ఒత్తిడి పడకుండా క్యాలరీల దహనం
- సహజమైన ఎక్స్‌ఫోలియంట్‌గా పాదాలకు రక్షణ
- శరీర సమతుల్యత, ఏకాగ్రత పెంపు
- ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతతను ఇస్తుంది
- బరువు తగ్గాలనుకునే వారికి ఇసుక నడక ఒక వరం

03



# బ్యాలెట్ బరిలో మాజీ మావోలు!

### ఆపరేషన్ కగార్ దెబ్బకు అడవి బాట వీడి జనజీవన స్రవంతిలోకి అగ్రనేతలు

- తుపాకీ గొట్టం ద్వారా కాకుండా ఓటు ద్వారా ప్రజాస్వామ్య పోరాటానికి సిద్ధం
- సొంత గూడు కట్టుకుంటారా లేదా భావసారుప్యత గల పార్టీల్లో చేరుతారా అన్నది సస్పెన్స్
- నక్సలైట్ ఉద్యమం నుంచి వచ్చి మంత్రిగా ఎదిగిన సీతక్క ప్రస్థానమే వీరికి ఆదర్శం
- పెరగనున్న నియోజకవర్గాల సంఖ్య మాజీలకు రాజకీయంగా 'రెడ్ కార్పెట్' పరవనుంది.
- చట్టసభల్లో మావోయిస్టు సిద్ధాంత గళం వినిపిస్తే ప్రభుత్వానికి చిక్కులే

02



### నేపాల్‌లో మావోయిస్టు డాన్

02

# ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంపై సుప్రీం సీరియస్

**విశాలభారతి, జాతీయం:**




దేశంలోని అత్యున్నత విద్యా ప్రమాణాలను నెలకొల్పాల్సిన జాతీయ విద్యాపరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ప్రచురించిన ఒక పాఠ్యపుస్తకం ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను సంచలనానికి దారితీసింది. ఎనిమిదవ తరగతి పాఠ్యపుస్తకంలో పొందుపరిచిన ఒక వివాదాస్పద అంశంపై సుప్రీంకోర్టు గురువారం నిప్పులు చెరిగింది. న్యాయవ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని సడలించే విధంగా, వ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా ఈ పాఠ్యాంశం ఉందంటూ ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. ఇది కేవలం పొరపాటున జరిగిన విషయం కాదని, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ముందస్తు ప్రణాళికతో చేసిన కుట్రలా కనిపిస్తోందని న్యాయస్థానం అభిప్రాయపడింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం. పంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ వ్యవహారాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి' అనే పేరుతో పాఠాన్ని చేర్చడంపై విచారణ చేపట్టిన కోర్టు, ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించబోమని స్పష్టం చేసింది. లేత ప్రాయంలో ఉన్న విద్యార్థుల మనసుల్లో న్యాయవ్యవస్థ పట్ల ప్రతికూల భావజాలాన్ని నూరిపోసేలా ఈ పాఠ్యాంశం ఉందని, ఇది సమాజంపై దీర్ఘకాలికంగా దుష్ప్రభావాన్ని చూపుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వివాదాస్పద అంశంపై సుప్రీంకోర్టు తక్షణమే కఠిన ఆదేశాలు జారీ చేసింది. సదరు పాఠ్యాంశం ఉన్న పుస్తకాన్ని తక్షణమే నిషేధిస్తూ, మార్కెట్‌లోకి ఇప్పటికే వెళ్లిన అన్ని భౌతిక ప్రతులను వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేవలం పుస్తక రూపంలోనే కాకుండా, ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న డిజిటల్ ప్రింట్‌లను కూడా తక్షణమే తొలగించాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర చర్యలు తీసుకుంటామని ధర్మాసనం ఘాటుగా హెచ్చరించింది.

ఈ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకమే ప్రజాస్వామ్యానికి పునాది అని, ఆ నమ్మకాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించడం క్రిమినల్ కాంటెంప్ట్ (న్యాయస్థాన ధిక్కరణ) పరిధిలోకి వస్తుందని పేర్కొంది. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా ఇలాంటి పాఠ్యాంశాలను చేర్చిన బాధ్యులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని న్యాయస్థానం హెచ్చరించింది. ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు కారణాలను వెలికితీయడానికి లోతైన దర్యాప్తు అవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది.

విచారణ సమయంలో ఎన్‌సీఈఆర్‌టీ తీరుపై కూడా సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ వివాదంపై బుధవారం ఎన్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన వివరణాత్మక ప్రకటనను కోర్టు తప్పుబట్టింది. ఆ ప్రకటనలో కనీసం 'క్షమాపణ' అనే పదం కూడా లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. పైగా తాము చేసిన చర్యను సమర్థించుకునే ప్రయత్నం చేయడం గమనార్హమని కోర్టు వ్యాఖ్యానించింది. బాధ్యతాయుతమైన విద్యా సంస్థ ఇలాంటి వైఖరి ప్రదర్శించడం సరికాదని, తప్పును సరిదిద్దుకోవడానికి బదులు సమర్థించుకోవడం ఆశ్చర్యకరమని పేర్కొంది.

ఈ క్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌తో పాటు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శికి సుప్రీంకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ తీవ్రమైన తప్పిదానికి బాధ్యులైన వారిపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇలాంటి సున్నితమైన అంశాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చేటప్పుడు పాటించాల్సిన నిబంధనలను ఎందుకు పక్కన పెట్టారో సమాధానం చెప్పాలని కోరింది. న్యాయవ్యవస్థను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న ఇటువంటి ప్రయోగాలు ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదకరమని ధర్మాసనం ఈ సందర్భంగా గుర్తు చేసింది.

విచారణ ప్రారంభంలోనే కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ ఘటనపై న్యాయస్థానానికి క్షమాపణలు తెలిపారు. జరిగిన పొరపాటును ప్రభుత్వం గుర్తించిందని, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని కోర్టుకు విన్నవించారు. అయితే, ప్రభుత్వం తరఫున వచ్చిన క్షమాపణలతో సుప్రీంకోర్టు శాంతించలేదు. కేవలం క్షమాపణలు చెప్పడం ద్వారా ఈ విషయాన్ని వదిలేయలేమని, దీనివల్ల జరిగిన నష్టం తీవ్రమైనదని ధర్మాసనం పేర్కొంది. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఈ కేసును నిశితంగా పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది.

పాఠ్యపుస్తకాలు అనేవి భావి భారత పౌరులను తీర్చిదిద్దే సాధనాలని, అందులో న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగబద్ధమైన సంస్థలపై తప్పుడు ప్రచారాలు చేయడం క్షమించరాని నేరమని నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయం విద్యా రంగంలో సంస్కరణలకు, రాజ్యాంగబద్ధమైన సంస్థల గౌరవాన్ని కాపాడటానికి ఒక మైలురాయిగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎన్‌సీఈఆర్‌టీ వంటి సంస్థలు పాఠ్యాంశాల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది. చిన్న వయసులోనే న్యాయవ్యవస్థ పట్ల వ్యతిరేకతను పెంపొందించే ఇలాంటి ప్రయత్నాలు భవిష్యత్తులో దేశ శాంతిభద్రతలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయవాదులు వాదించారు. అందుకే సుప్రీంకోర్టు ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించి, విచారణను వేగవంతం చేసింది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి, వెంటనే మార్కెట్ నుంచి పుస్తకాలను ఉపసంహరించుకోవాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సి ఉంది. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని వివరాలను, బాధ్యుల వివరణలను పరిగణనలోకి తీసుకునేందుకు తదుపరి విచారణను మార్చి 11వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. ఆ రోజున ఎన్‌సీఈఆర్‌టీ, విద్యాశాఖ సమర్పించే అఫిడవిట్ల ఆధారంగా న్యాయస్థానం తదుపరి చర్యలను ఖరారు చేయనుంది. దేశవ్యాప్తంగా విద్యావేత్తలు, న్యాయ నిపుణులు మార్చి 11న వెలువడే తీర్పు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ వెలుగులు

మొదటిపేజీ తరువాయి




ప్రైవేట్ పాఠశాలల ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా సీఎం రేవంత్ రెడ్డి కఠిన నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు విరుద్ధంగా, పరిమితికి మించి ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. అటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయడంతో పాటు, అధికంగా వసూలు చేసిన మొత్తాన్ని రికవరీ చేసేలా కఠిన నిబంధనలు రూపొందించాలని స్పష్టం చేశారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న సిఫార్సులపై ప్రజల అభిప్రాయాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని, పారదర్శకతకు పెద్దపీట వేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఉన్నత విద్యా వ్యవస్థలోనూ సంస్కరణలు అవసరమని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఈ సమీక్షలో పాల్గొన్న వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ఉన్నత విద్యామండలి అధికారులతో చర్చించిన ఆయన, విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా విద్యా బోధన ఉండాలని కోరారు. విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలను ఇచ్చే కేంద్రాలుగా కాకుండా, పరిశోధనలకు మరియు నైపుణ్యాభివృద్ధికి నిలయాలుగా మారాలని సూచించారు. అప్పుడే తెలంగాణ విద్యార్థులు గ్లోబల్ మార్కెట్‌లో పోటీ పడగలరని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ కీలక సమావేశానికి సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కే కేశవరావుతో పాటు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ వంటి అనుభవజ్ఞులు హాజరయ్యారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి, విద్యాశాఖలో మార్పులను త్వరితగతిన అమలు చేయాలని సీఎం కోరారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తేనే ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా, ఎంసీహెచ్ఆర్‌డీలో జరిగిన గ్రూప్ 2, గ్రూప్ 3 అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో కూడా సీఎం పాల్గొని వారిలో ఉత్సాహాన్ని నింపారు. కొత్తగా విధుల్లోకి చేరుతున్న అధికారులు ప్రజా సేవలో అంకితభావంతో ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో అధికారుల పాత్ర కీలకమని, ముఖ్యంగా విద్యా, ఆరోగ్య రంగాల్లో ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. మొత్తానికి, తెలంగాణ విద్యారంగంలో ఒక సరికొత్త శకం ప్రారంభం కాబోతోందని ఈ సమీక్షా సమావేశం ద్వారా స్పష్టమవుతోంది. మౌలిక సదుపాయాల నుంచి మధ్యాహ్న భోజనం వరకు, ట్రాన్స్‌పోర్ట్ నుంచి ఫీజుల నియంత్రణ వరకు సీఎం తీసుకుంటున్న నిర్ణయాలు విద్యార్థులకు, తల్లిదండ్రులకు పెద్ద ఊరటనిస్తున్నాయి. ప్రభుత్వ బడి అంటేనే ఒక నమ్మకమైన బ్రాండ్‌గా మార్చాలన్న రేవంత్ రెడ్డి సంకల్పం నెరవేరితే, రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# బ్యాలెట్ బరిలో మాజీ మావోలు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



దశాబ్దాల కాలం పాటు అడవిని నమ్ముకుని, తుపాకీ గొట్టమే రాజ్యానికి మార్గమని నమ్మిన మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు చరిత్ర పుటల్లోకి మారుతోంది. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మావోయిస్టు ముక్త భారత్' లక్ష్యం దాదాపు నెరవేరుతున్న తరుణంలో, అగ్రనేతలందరూ వరుసగా జనజీవన స్రవంతిలోకి రావడం దేశ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీసింది. మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న, దేవ్ జీ వంటి ఉద్దండులు ఇప్పుడు బందూకు వదిలి బ్యాలెట్ పట్టుకోవాలని నిర్ణయించుకోవడం సామాన్య విషయం కాదు. నిన్నటి వరకు ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన నోళ్లే, రేపు అదే ఎన్నికల గోదాలో నిలబడి ఓట్లు అడగబోతుండటం వర్తమాన రాజకీయాల్లో అత్యంత ఆసక్తికర పరిణామం. మావోయిస్టు ఉద్యమం బలహీనపడటానికి కేవలం ప్రభుత్వ నిర్బంధమే కారణం కాదు, కాలం చెల్లిన సిద్ధాంతాలు మరియు మారుతున్న సామాజిక పరిస్థితులు కూడా ప్రధాన భూమిక పోషించాయి. నేటి యువత టెక్నాలజీతో దూసుకుపోతున్న వేళ, పాతతరం గెరిల్లా యుద్ధతంత్రాలు ఆచరణాత్మకంగా విఫలమవుతున్నాయి. ఈ వాస్తవాన్ని గుర్తించిన మాజీ నేతలు, ప్రజల సమస్యలపై చట్టబద్ధంగా పోరాడాలని నిశ్చయించుకున్నారు. అయితే, వీరంతా కలిసి ఒక కొత్త రాజకీయ పక్షాన్ని ఏర్పాటు చేస్తారా? లేక ఇప్పటికే ఉన్న కమ్యూనిస్టు పార్టీలను బలోపేతం చేస్తారా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. కొత్త పార్టీ పెడితే ప్రస్తుత ధన, కుల రాజకీయాలను తట్టుకుని నిలబడటం వీరికి పెను సవాలే.

ప్రస్తుత రాజకీయాల్లో మాజీ మావోయిస్టులకు ఒక స్పష్టమైన 'స్పేస్' కనిపిస్తోంది. ముఖ్యంగా తెలంగాణలో మంత్రి సీతక్క సాధించిన విజయం వీరికి ఒక నమ్మకాన్ని ఇచ్చింది. అడవిలో అన్నగా ఉన్న వ్యక్తి, అసెంబ్లీలో ప్రజాప్రతినిధిగా గళం విప్పితే వచ్చే ఇంపాక్ట్ వేరుగా ఉంటుంది. ఇప్పటికే బడే చొక్కారావు వంటి నేతలు తమ రాజకీయ ఆకాంక్షలను బహిరంగంగానే వ్యక్తపరుస్తున్నారు. వీరి రాకతో అట్టడుగు వర్గాలైన ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన తరగతుల్లో ఒక కొత్త చైతన్యం వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా గడ్చిరోలి నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు వీరి ప్రభావం గట్టిగా ఉండబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

మరోవైపు, దేశంలో త్వరలో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ఈ మాజీ నేతలకు వరంగా మారనుంది. పార్లమెంటు సీట్లు 543 నుంచి 850కి పైగా పెరగనుండటంతో, కొత్త నియోజకవర్గాలు అందుబాటులోకి వస్తాయి. ఈ క్రమంలో రాజకీయ అరంగేట్రం చేసే వారికి అవకాశాలు మెరుగుపడతాయి. ముఖ్యంగా రెడ్ కారిడార్‌గా పిలవబడే ప్రాంతాల్లో కొత్త స్థానాలు ఏర్పడితే, అక్కడ మాజీ మావోయిస్టులు తమ పట్టును నిరూపించుకునే అవకాశం ఉంది. చట్టసభల్లో వీరు అడుగుపెడితే, ప్రజా సమస్యలపై జరిగే చర్చల్లో ఒక గుణాత్మక మార్పు వస్తుందని సామాన్య జనం ఆశిస్తున్నారు. అయితే, మాజీ మావోయిస్టుల రాజకీయ ప్రవేశం అధికార బీజేపీకి కొంత ఇబ్బందికర పరిణామమేనని చెప్పాలి. ఎందుకంటే, సిద్ధాంతపరంగా బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించే వీరు, అడవుల నుంచి బయటకు వచ్చి నేరుగా ప్రజల్లోకి వెళ్తే ఆ సిద్ధాంత పోరాటం మరింత తీవ్రతరం అవుతుంది. భౌతికంగా ఆయుధాలు లేకపోయినా, వారి మాటల్లోని పదును ప్రభుత్వ విధానాలను ఎండగట్టడానికి సరిపోతుంది. ముఖ్యంగా మనువాద వ్యతిరేక అజెండాతో వీరు ప్రజల్లోకి వెళ్తే, అది ఓట్ల సమీకరణను తలకిందులు చేయవచ్చు. బూర్జువా పార్టీలుగా వీరు అభివర్ణించే ప్రధాన పార్టీలతో వీరు ఎలా జతకడతారో చూడాలి.

మాజీల ముందున్న అతిపెద్ద సవాలు నేటి తరం యువతను ఆకట్టుకోవడం. డిజిటల్ యుగంలో ఉన్న యువతకు 70ల నాటి విప్లవ భావజాలం ఎంతవరకు ఎక్కుతుందన్నది సందేహమే. కేవలం భావోద్వేగాలతో కాకుండా, అభివృద్ధి, ఉపాధి వంటి అంశాలను కూడా తమ అజెండాలో చేర్చుకుంటేనే వీరు మనుగడ సాగించగలరు. సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువగా ఉన్న ఈ రోజుల్లో, పాత తరహా ప్రసంగాలు కాకుండా ఆధునిక రాజకీయ వ్యూహాలను కూడా వీరు అలవరచుకోవాల్సి ఉంటుంది. అప్పుడే బ్యాలెట్ పోరులో వీరు అనుకున్న లక్ష్యాన్ని ముద్దాడగలరు.

నిజానికి, మావోయిస్టుల రాజకీయ ప్రవేశం భారత ప్రజాస్వామ్యానికి ఒక ఆరోగ్యకరమైన సూచిక. తుపాకీ పట్టిన చేతులు రాజ్యాంగంపై ప్రమాణం చేసి చట్టసభలకు రావడం అంటే, ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం పెరగడమే. అణగారిన వర్గాల గొంతుకలుగా వీరు మారితే, పాలనలో జవాబుదారీతనం పెరుగుతుంది. గతంలో సాంబశివుడు వంటి నేతలు రాజకీయాల్లోకి రావాలని ప్రయత్నించినా, మధ్యలోనే ప్రాణాలు కోల్పోయారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్రభుత్వం కూడా వీరిని ప్రధాన స్రవంతిలోకి ఆహ్వానిస్తోంది కాబట్టి, వీరి రాజకీయ ప్రయాణం సజావుగా సాగే అవకాశం ఉంది. మొత్తానికి, రెడ్ కారిడార్ నుంచి పొలిటికల్ కారిడార్‌లోకి మారుతున్న ఈ ప్రయాణం భారత రాజకీయాల్లో ఒక నూతన విప్లవానికి నాంది కానుంది. వీరు ఒంటరిగా పోరాడతారా లేక 'ఇండియా' కూటమి వంటి పెద్ద వేదికలపై కనిపిస్తారా అన్నది కాలమే నిర్ణయించాలి. కానీ, ఒకటయితే స్పష్టం రాబోయే ఎన్నికల్లో మాజీ మావోయిస్టుల పాత్ర అత్యంత కీలకం కాబోతోంది. వీరి రాకతో రాజకీయాల్లో నైతిక విలువలు పెరుగుతాయా లేక వీరు కూడా ప్రస్తుత రాజకీయ రొంపిలో కలిసిపోతారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. అడవి వీడి వచ్చిన అన్నలు ఇప్పుడు సామాన్య ప్రజల 'అన్నలు'గా మారి, వారి కష్టాలను చట్టసభల గడప దాటిస్తారో లేదో చూడాలి. డీలిమిటేషన్ కల్పించే వెసులుబాటు, మారుతున్న రాజకీయ సమీకరణలు వెరసి.. మాజీ మావోయిస్టుల రాజకీయ అరంగేట్రానికి అడుగులు పడ్డట్టే కనిపిస్తోంది. యుద్ధ క్షేత్రం మారింది కానీ, వారు పోరాడే లక్ష్యం మారలేదని చెబుతున్న ఈ నేతలు, బ్యాలెట్ బాక్సుల్లో తమ భవిష్యత్తును ఎలా వెతుక్కుంటారో వేచి చూడాలి.

# ఇళ్లపై రాజకీయం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాగించిన అక్రమాలు, అవకతవకలపై రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల కష్టార్జితమైన లక్షల కోట్ల రూపాయలను ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో వృధా చేశారని, ఇంత ఖర్చు చేసినా రైతులకు ఆశించిన స్థాయిలో ఫలితం దక్కలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు చేసిన తప్పిదాల వల్ల నేడు రాష్ట్ర ఖజానాపై భారం పడటమే కాకుండా, నిర్మించిన నిర్మాణాలు కూడా నాణ్యత లోపంతో కుప్పకూలుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ అగ్రనేతలు చేస్తున్న ఆరోపణలు కేవలం తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఆడుతున్న డ్రామాలేనని ఆయన ఎద్దేవా చేశారు.

ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వ వైఫల్యాలను పొంగులేటి ఎండగట్టారు. సుమారు రూ. 1.08 లక్షల కోట్ల భారీ అంచనాతో ఈ ప్రాజెక్టును నిర్మించినా, అందుబాటులోకి వచ్చిన నీరు కేవలం 110 టీఎంసీలు మాత్రమేనని గుర్తుచేశారు. ఇంత భారీ వ్యయం చేసిన తర్వాత కూడా పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయలేకపోవడం లేదా వినియోగించుకోలేకపోవడం గత పాలకుల అసమర్థతకు నిలువెత్తు నిదర్శనమని మండిపడ్డారు. ప్రతి ఎకరాకు నీరు ఇస్తామని చెప్పి, చివరకు అప్పుల కుప్పను మిగిల్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల వ్యయం పెంచుకుంటూ పోవడమే తప్ప, క్షేత్రస్థాయిలో ఆయకట్టుకు నీరు అందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని స్పష్టం చేశారు.

గత మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ప్రస్తుతం చేస్తున్న వ్యాఖ్యలు కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా సాగుతున్నాయని పొంగులేటి ఆక్షేపించారు. వాస్తవాలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం దురదృష్టకరమని హితవు పలికారు. ఎన్నికలకు ముందే బ్యారేజీలు కుంగిపోయిన విషయాన్ని ప్రజలు గమనించారని, ఆ నష్టానికి బాధ్యత వహించాల్సిన వారు ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ఉండాల్సిన వారు, రాష్ట్ర ప్రయోజనాల కోసం సలహాలు ఇవ్వాల్సింది పోయి, కేవలం విమర్శలకే పరిమితం కావడం వారి సంకుచిత రాజకీయ ఆలోచనా ధోరణిని సూచిస్తోందని దుయ్యబట్టారు.

రాష్ట్ర రాజకీయాల్లో బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని, వారిద్దరి మధ్య 'ఫెవికాల్ బంధం' కొనసాగుతోందని పొంగులేటి సంచలన వ్యాఖ్యలు చేశారు. బయటకు విమర్శించుకుంటున్నట్లు నటించినా, అంతర్గతంగా ఒకరికొకరు సహకరించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీలు కలిసి తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేయడమే వారి ఉమ్మడి అజెండా అని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ పెద్దలతో బీఆర్ఎస్ నేతలు జరుపుతున్న మంతనాలు చూస్తుంటే వారి మధ్య ఉన్న రహస్య స్నేహం బహిరంగ రహస్యమని అందరికీ అర్థమవుతోందని ఆయన అన్నారు.

తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. రాష్ట్ర హక్కుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పోరాడుతుందని, ఢిల్లీ స్థాయిలో అయినా, అంతర్రాష్ట్ర స్థాయిలో అయినా తెలంగాణ వాణిని బలంగా వినిపిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాలను సరిదిద్దేందుకు ప్రస్తుత ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని పేర్కొన్నారు. కేవలం ఓట్ల కోసం కాకుండా, భవిష్యత్ తరాల కోసం ప్రాజెక్టులను శాస్త్రీయంగా అభివృద్ధి చేస్తామని, రైతులకు ప్రతి నీటి బొట్టును అందించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వెల్లడించారు.

ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన అవినీతిపై లోతైన విచారణ జరిపించి, బాధ్యులను చట్టం ముందు నిలబెడతామని పొంగులేటి హెచ్చరించారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల్లో జరిగిన సాంకేతిక లోపాలు, ఆర్థిక లావాదేవీలపై ఇప్పటికే ఒక అంచనాకు వచ్చామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని, పారదర్శకమైన పాలన అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ చీకటి ఒప్పందాలను వెలుగులోకి తెచ్చి, ప్రజల సొమ్మును రక్షిస్తామని భరోసా ఇచ్చారు.

రైతుల సంక్షేమం గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని, అధికారం ఉన్నప్పుడు కాంట్రాక్టర్ల సంక్షేమం చూసిన వారు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని పొంగులేటి విమర్శించారు. తమ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, ధాన్యం కొనుగోళ్ల నుంచి సాగునీటి సరఫరా వరకు ప్రతి విషయంలోనూ అన్నదాతకు అండగా ఉంటామని చెప్పారు. గత పాలనలో జరిగిన విధ్వంసాన్ని పునర్నిర్మించడం కష్టమైనా, పట్టుదలతో ముందుకు సాగుతామని వివరించారు. రాజకీయాల కంటే ప్రజా శ్రేయస్సే ముఖ్యమని భావించే తమ ప్రభుత్వం, గత పాలకుల మాదిరిగా ప్రచార ఆర్భాటాలకు పోకుండా క్షేత్రస్థాయిలో పనిచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ సమాజం నేడు చైతన్యవంతంగా ఉందని, ఎవరు ఏం చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని పొంగులేటి అన్నారు. అసత్య ప్రచారాలతో కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లాలని చూస్తే అది సాధ్యం కాదని హెచ్చరించారు. అభివృద్ధి పథంలో పయనిస్తున్న రాష్ట్రాన్ని అడ్డుకునే ప్రయత్నాలను ప్రజలే తిప్పికొడతారని పేర్కొన్నారు. ప్రాజెక్టుల పేరుతో జరిగిన 'లక్ష కోట్ల మాయాజాలం'పై ప్రజల్లో చర్చ జరగాలని, అప్పుడే గత పాలకుల అసలు రంగు బయటపడుతుందని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ఆర్థిక క్రమశిక్షణ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేస్తుందని, ప్రతి ప్రాజెక్టు వివరాలను ప్రజల ముందు ఉంచుతామని పొంగులేటి స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే ఏ నిర్ణయాన్నీ తమ ప్రభుత్వం తీసుకోదని, ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు.

# నేపాల్‌లో మావోయిస్టు డాన్

- నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయ సమీప ఆశ్రమంలో గణపతి ఆచూకీ లభ్యం
- తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన మావోయిస్ట్ మాజీ చీఫ్
- తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసుల నిఘాలో చిక్కిన అగ్రనేత
- కేంద్ర బలగాలకు కాకుండా తెలంగాణ పోలీసులకే లొంగిపోయేందుకు మొగ్గు
- గణపతి భార్య సుజాతక్క సహా పలువురు నేతల లొంగుబాటుకు రంగం సిద్ధం
- ఆపరేషన్ కగార్ నేపథ్యంలో మావోయిస్ట్ పార్టీకి కోలుకోలేని దెబ్బ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



దశాబ్దాల పాటు భారత విప్లవోద్యమాన్ని ఉర్రూతలూగించి, అడవిని తన అలికిడితో గడగడలాడించిన మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి అస్తమయ దశకు చేరుకున్నారు. దట్టమైన అడవుల్లో గెరిల్లా యుద్ధ తంత్రాలను నడిపిన ఈ అగ్రనేత, ప్రస్తుతం నేపాల్‌లోని ఒక చిన్న కుటీరంలో మంచానికే పరిమితమై పోలీసుల నిఘా నీడలో ఉన్నారు. గత కొంతకాలంగా మావోయిస్ట్ పార్టీకి చెందిన కీలక నేతలంతా వరుసగా సరెండర్ కావడంతో, పోలీసు యంత్రాంగం దృష్టి ఇప్పుడు పూర్తిస్థాయిలో గణపతిపైనే కేంద్రీకృతమైంది. ఆయనను అదుపులోకి తీసుకోవడం ద్వారా విప్లవోద్యమ మూలాలను శాశ్వతంగా అంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

గణపతి ఆచూకీ కోసం కేంద్ర మరియు వివిధ రాష్ట్రాల ఇంటెలిజెన్స్ విభాగాలు గత కొన్నేళ్లుగా అన్వేషిస్తున్నప్పటికీ, ఇటీవల లొంగిపోయిన మావోయిస్ట్ నేతలు ఇచ్చిన సమాచారం కీలక మలుపు తిప్పింది. నేపాల్‌లోని ప్రఖ్యాత పశుపతినాథ్ ఆలయ పరిసరాల్లోని ఒక ఆశ్రమంలో గణపతి ఆశ్రయం పొందుతున్నట్లు తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులకు స్పష్టమైన ఆధారాలు లభించాయి. ఈ సమాచారం అందిన వెంటనే ప్రత్యేక బృందాలు నేపాల్‌కు చేరుకుని, ఆయన కదలికలపై నిశితంగా నిఘా ఉంచాయి. సుమారు ఏడు పదుల వయస్సు పైబడిన గణపతి, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో పాటు వృద్ధాప్య భారంతో కనీసం కదలలేని స్థితిలో ఉన్నట్లు నిర్ధారణ అయింది. దాదాపు ఐదారు ఏళ్ల క్రితమే అనారోగ్యం కారణంగా గణపతి పార్టీ బాధ్యతల నుంచి తప్పుకుని, మెరుగైన వైద్యం కోసం అడవిని విడిచి పట్టణ ప్రాంతాలకు చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' ఉధృతమవుతున్న తరుణంలోనే ఆయన రహస్యంగా సరిహద్దులు దాటి నేపాల్ చేరుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సమాచారం పోలీసులకు చేరడానికి చాలా సమయం పట్టింది. ఆశ్రమంలో మెడిటేషన్ మరియు ప్రాథమిక వైద్య చికిత్సలు పొందుతున్న ఆయనను చూసినప్పుడు, ఒకప్పుడు అడవిని శాసించిన సేనాని ఇతనేనా అనే అనుమానం కలిగేలా ఆయన ఆరోగ్యం క్షీణించింది. ప్రస్తుతం ఆయనకు నిత్యం ఒక అటెండెంట్ సాయం అవసరమవుతోంది. తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులు ఇప్పటికే ఆశ్రమంలో గణపతిని సంప్రదించి, ఆయన ప్రస్తుత పరిస్థితిని సమీక్షించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. పార్టీలోని ప్రస్తుత సంక్షోభం, కీలక నేతల లొంగుబాటు వంటి విషయాలను ఆయనకు వివరించగా, ఆయన మానసిక స్థితి కూడా ప్రస్తుతం చాలా బలహీనంగా ఉన్నట్లు గమనించారు. సుదీర్ఘకాలం పార్టీని నడిపినప్పటికీ, ఇప్పుడు తన కళ్లముందే పార్టీ బలహీనపడుతుండటం పట్ల ఆయన పెద్దగా స్పందించలేని స్థితిలో ఉన్నారని అధికారులు గుర్తించారు. మానవీయ కోణంలో ఆయన ప్రాణానికి ఎటువంటి హాని కలగకుండా గౌరవప్రదంగా లొంగిపోవాలని పోలీసులు ప్రతిపాదించినట్లు సమాచారం.

ఈ చర్చల సందర్భంగా గణపతి ఒక కీలకమైన షరతును పోలీసుల ముందు ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది. కేంద్ర భద్రతా బలగాలకు లేదా ఇతర రాష్ట్రాల పోలీసులకు తాను లొంగిపోయే ప్రసక్తే లేదని, ఒకవేళ లొంగిపోతే తన స్వరాష్ట్రమైన తెలంగాణ పోలీసుల వద్దే లొంగిపోతానని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. గతంలో కూడా పలువురు మావోయిస్ట్ నేతలు తెలంగాణ పోలీసుల పనితీరుపై నమ్మకంతో ఇక్కడే సరెండర్ అయిన ఉదాహరణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయనను సురక్షితంగా తెలంగాణకు తరలించేందుకు ఇంటెలిజెన్స్ పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వార్తలు వస్తున్నాయి.

గణపతి అరెస్ట్ లేదా లొంగుబాటు ప్రక్రియ కేవలం ఒక లాంఛనంగా మాత్రమే మిగిలి ఉందని, ఈ వారంలోనే ఆయనను హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. దీనికంటే ముందే ఆయన భార్య, మావోయిస్ట్ పార్టీలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన జోడె రత్నాబాయి అలియాస్ సుజాతక్క లొంగుబాటును పోలీసులు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఆమెతో పాటు మరికొందరు కీలక నేతలు కూడా జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరి లొంగుబాటు తర్వాతే గణపతిని బహిరంగంగా మీడియా ముందుకు తీసుకువచ్చే వ్యూహాన్ని పోలీసులు అనుసరిస్తున్నారు.

# కలెక్టర్ బదిలీ.. గిరిజనుల సంబరాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మహబూబాబాద్ జిల్లా పాలనా యంత్రాంగంలో గత కొంతకాలంగా నెలకొన్న స్తబ్దతకు తెరపడింది. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌ను ప్రభుత్వం బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో మానుకోట గడ్డపై పండగ వాతావరణం నెలకొంది. ఈ వార్త తెలియగానే జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో గిరిజన ప్రజా సంఘాలు, రైతు కూలీలు రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేయడం కలెక్టర్ పనితీరుపై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో అద్దం పడుతోంది. ఒక ఐఏఎస్ అధికారి బదిలీని ప్రజలు ఇంతగా వేడుక చేసుకోవడం ఉమ్మడి వరంగల్ జిల్లా చరిత్రలోనే అరుదైన విషయంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గత రెండేళ్లుగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన అద్వైత్ కుమార్ సింగ్, జిల్లా ప్రయోజనాలను గాలికొదిలేశారని స్థానిక గిరిజన నాయకులు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పథంలో దూసుకుపోవాల్సిన మానుకోటను తన అనాలోచిత నిర్ణయాలతో ఆయన కనీసం పదేళ్లు వెనక్కి నెట్టేశారని వారు మండిపడుతున్నారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో ఉండే క్లిష్టమైన సమస్యలను అర్థం చేసుకోవడంలో ఆయన విఫలమయ్యారని, సామాన్యుడికి కలెక్టరేట్ తలుపులు ఎప్పుడూ మూసే ఉండేవని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల గొంతు వినని అధికారి జిల్లాలో ఉండటం కంటే వెళ్లడమే మేలని పల్లె జనం బాహాటంగానే చర్చించుకుంటున్నారు.



జిల్లాలో అత్యంత కీలకమైన భూ సమస్యల పరిష్కారంలో కలెక్టర్ వ్యవహరించిన తీరుపై రైతాంగం తీవ్ర అసంతృప్తితో ఉంది. పట్టాదారు పాసుపుస్తకాల జాప్యం, ధరణి పోర్టల్‌లో నెలకొన్న సాంకేతిక ఇబ్బందుల వల్ల వేలాది మంది రైతులు కలెక్టరేట్ చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోయింది. భూముల సర్వేలు, సరిహద్దు వివాదాల విషయంలో బాధితులు మొరపెట్టుకున్నా కలెక్టర్ స్పందించలేదని, దీనివల్ల సాగు పనులకు ఆటంకం కలగడమే కాకుండా రైతులు మానసిక వేదనకు గురయ్యారని రైతు సంఘాలు ధ్వజమెత్తాయి. పేదవాడి భూమికి రక్షణ కల్పించాల్సిన బాధ్యతను ఆయన విస్మరించడం జిల్లాకు శాపంగా మారిందని వారు ఆరోపించారు.

అన్నిటికంటే ముఖ్యంగా కలెక్టర్‌కు వచ్చే ప్రత్యేక నిధుల వినియోగంపై పెను దుమారమే రేగింది. జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, పేద వర్గాల సంక్షేమానికి వెచ్చించాల్సిన కోట్లాది రూపాయల నిధులను ఆయన వినియోగించకుండా తిరిగి ప్రభుత్వానికి పంపించేశారని గిరిజన సంఘాలు ఆధారాలతో సహా విమర్శిస్తున్నాయి. నిధులు ఉండి కూడా అభివృద్ధి పనులు చేపట్టకపోవడం, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహించడం జిల్లా ప్రజలకు చేసిన ద్రోహమని వారు పేర్కొన్నారు. మానుకోట లాంటి వెనుకబడిన జిల్లాకు దక్కాల్సిన నిధులను సద్వినియోగం చేయకపోవడం పట్ల విద్యావంతులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

విద్య, వైద్య రంగాల్లో జిల్లా పరిస్థితి అత్యంత దయనీయంగా మారడానికి కలెక్టర్ అలసత్వమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాల కల్పన, మందుల సరఫరాపై ఆయన ఎన్నడూ క్షేత్రస్థాయి సమీక్షలు నిర్వహించలేదని తెలుస్తోంది. అలాగే గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు, హాస్టళ్ల నిర్వహణను గాలికి వదిలేశారని విమర్శలు వస్తున్నాయి. కలెక్టర్ స్థాయిలో ఉండాల్సిన పర్యవేక్షణ లోపించడం వల్ల వ్యవస్థలన్నీ కుప్పకూలాయని, పేద విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని బాధితులు తమ ఆవేదనను వెళ్లగక్కుతున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కూడా కలెక్టర్ తీరు వివాదాస్పదంగా మారింది. సామాజిక పింఛన్లు, ఇళ్ల పట్టాల పంపిణీ వంటి అంశాల్లో లబ్ధిదారుల ఎంపికలో జాప్యం జరిగిందని, దీనివల్ల నిరుపేదలు ప్రభుత్వ సాయం అందక అవస్థలు పడ్డారని తెలుస్తోంది. ప్రజావాణి కార్యక్రమంలో అందిన వేలాది అర్జీలు పరిష్కారానికి నోచుకోకుండా మూలనపడి ఉండటమే ఆయన పనితీరుకు నిదర్శనమని ప్రజలు అంటున్నారు. సామాన్యుడి ఫిర్యాదును కూడా పట్టించుకోని నైజం వల్ల జిల్లా యంత్రాంగంపై ప్రజల్లో ఉన్న నమ్మకం పూర్తిగా సన్నగిల్లిందని గిరిజన నేతలు విమర్శించారు.

కేవలం సామాన్య ప్రజలనే కాకుండా, జిల్లా అభివృద్ధి కోసం మంత్రులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన ఆదేశాలను కూడా కలెక్టర్ బేఖాతరు చేశారని ప్రచారం జరుగుతోంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సూచనలను కూడా ఆయన లెక్కచేయలేదని, దీనివల్ల పాలనలో ప్రతిష్టంభన ఏర్పడిందని సమాచారం. నియోజకవర్గాల అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల విడుదల, అనుమతుల విషయంలో కలెక్టర్ మొండివైఖరి ప్రదర్శించారని, ఇది అభివృద్ధి కుంటుపడటానికి కారణమైందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అధికారుల మధ్య సమన్వయం లోపించడం జిల్లా ప్రగతికి గొడ్డలిపెట్టుగా మారింది.

ఈ నేపథ్యంలో అద్వైత్ కుమార్ సింగ్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల మానుకోట వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ బదిలీ జిల్లాకు ఒక కొత్త ఊపిరి పోస్తుందని, ఇకనైనా ఆగిపోయిన అభివృద్ధి పనులు పరుగులు పెడతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఒక అధికారి వెళ్లడం వల్ల ఇంతటి సంబరాలు జరుగుతున్నాయంటే, ఆయన పాలన ఏ స్థాయిలో ప్రజలను ఇబ్బంది పెట్టిందో ప్రభుత్వ పెద్దలు కూడా గమనించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయని ఏ అధికారికి అయినా ఇటువంటి పరాభవం తప్పదని సోషల్ మీడియా వేదికగా యువత కామెంట్స్ చేస్తున్నారు.

జిల్లా కొత్త కలెక్టర్ నుంచి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా గిరిజన జిల్లా సమస్యలపై అవగాహన ఉన్న, పేదల బాధలను అర్థం చేసుకునే మానవత్వం ఉన్న అధికారి రావాలని కోరుకుంటున్నారు. ధరణి సమస్యలు, రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై కొత్త కలెక్టర్ దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అభివృద్ధిలో వెనుకబడిన మహబూబాబాద్‌ను మళ్లీ గాడిలో పెట్టాల్సిన బాధ్యత కొత్తగా వచ్చే అధికారిపై ఉందని, వారికి తాము పూర్తి సహకారం అందిస్తామని గిరిజన సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.

## ఉత్సాహంగా జర్నలిస్ట్ కప్
# క్రికెట్ పోటీలు



- గౌరవ అతిథిలుగా హజరైన ఎక్సైజ్ సిఐ రాజి రెడ్డి,
- ఎస్ఐలు సురేష్, నాగుల్ మీరా. కరకగూడెం మీడియా కెప్టెన్ దుర్గం ప్రేమ్ కుమార్

**విశాలభారతి, కరకగూడెం:**

పినపాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్చిరెడ్డిపల్లి క్రికెట్ గ్రౌండ్లో నిర్వహిస్తున్న జర్నలిస్ట్ కప్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రెండో రోజు ఉత్సాహభరితంగా సాగాయి. రెండో రోజు టోర్నమెంట్‌కు మణుగూరు ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి, ఎస్ఐలు సురేష్, నాగల్ మీరా గౌరవ అతిథులుగా విచ్చేసి టోర్నమెంట్ లో పాల్గొని, క్రికెట్ ఆడి అభిమానులను అలరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు, అధికారులు, ప్రజాప్రతినిధుల ఐక్యత, క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న జర్నలిస్ట్ కప్ క్రికెట్ టోర్నమెంట్ అభినందనీయమని అన్నారు. ఈ టోర్నమెంట్‌లో జరుగుతున్న మ్యాచ్‌లు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని అన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీపడుతూ విజయం సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న కమిటీకి వారు అభినందనలు తెలిపారు. రెండో రోజు పోటీలలో పినపాక ప్రజాప్రతినిధులు, కరకగూడెం జర్నలిస్టులకు మధ్య జరిగిన మ్యాచ్ లో కరకగూడెం జర్నలిస్టులు విజయం సాధించారు. మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్లో ఉపాధ్యాయులు బిటిపిఎస్ జెపిఎ లకు కు మధ్య జరిగిన మ్యాచ్లో బిటిపిఎస్ జెపిఎ జట్టు విజయం సాధించారు. మరో మ్యాచ్లో పినపాక పోలీస్ వర్సెస్ కరకగూడెం ఎంపీడీవో ఆఫీస్ తో జరిగిన మ్యాచ్లో పోలీస్ జట్టు విజయం సాధించింది. సాయంత్రం జరిగిన మ్యాచ్లో ఎక్సైజ్ డిపార్టుమెంటు పినపాక ఎంపీడీవో జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో పినపాక ఎంపీడీవో జట్టు విజయం సాధించింది. కర్క గూడెం ప్రెస్ క్లబ్ కెప్టెన్ దుర్గం ప్రేమ్ కుమార్, సురేష్ ప్రవీణ్, సురేందర్, రంజిత్, దిలీప్, పెద్ది వెంకటేష్ గౌడ్, హనుమంతరావు, ప్రవీణ్ పార్క్ మ్యాచ్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అతిథులు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులు అందజేయడం జరిగింది.

# భారత్‌ఇజ్రాయెల్ స్నేహం ఇక 'స్పెషల్'

**మొదటిపేజీ తరువాయి**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులు రాబోతున్న వేళ, భారత్‌ఇజ్రాయెల్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తుది రూపు దాల్చబోతుండటం వ్యాపార వర్గాల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ ఒప్పందం ద్వారా అటు భారతీయ ఎగుమతిదారులు, ఇటు ఇజ్రాయెల్ సంస్థలు పరస్పర ప్రయోజనం పొందనున్నాయి. కేవలం వస్తువుల మార్పిడి మాత్రమే కాకుండా, సేవల రంగంలోనూ సరికొత్త ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఈ డీల్ వల్ల ద్వైపాక్షిక వాణిజ్యం గణనీయంగా పెరగడమే కాకుండా, ఇరుదేశాల వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. భారతీయ డిజిటల్ విప్లవం 'యూపీఐ' ఇక ఇజ్రాయెల్ వీధుల్లోనూ సందడి చేయబోతోంది. ఇజ్రాయెల్‌లో భారతీయ యూపీఐని వినియోగంలోకి తెచ్చేందుకు కుదిరిన ఒప్పందం పర్యాటకులకు, అక్కడి నిపుణులకు పెద్ద ఊరటనివ్వనుంది. ఎన్‌పీసీఐ, ఇజ్రాయెల్‌కు చెందిన మాషావ్ డిజిటల్ పేమెంట్స్ మధ్య కుదిరిన ఈ అవగాహన, సరిహద్దు దాటిన చెల్లింపులను సులభతరం చేయనుంది. డిజిటల్ ఇండియా విజన్ ప్రపంచవ్యాప్తంగా ఎలా విస్తరిస్తుందో చెప్పడానికి ఇదొక నిదర్శనంగా నిలిచింది. దీనివల్ల రెండు దేశాల మధ్య పర్యాటక రంగం కూడా కొత్త పుంతలు తొక్కనుంది. టెక్నాలజీ రంగంలో ఇజ్రాయెల్కున్న నైపుణ్యాన్ని, భారత్ వద్ద ఉన్న అపారమైన మానవ వనరులను అనుసంధానించడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇరు ప్రధానులు భావిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు మరియు బయో టెక్నాలజీ వంటి భవిష్యత్తు అవసరాలపై సంయుక్తంగా పరిశోధనలు చేయనున్నారు. ఇందుకోసం జాయింట్ రీసెర్చ్ కాల్స్ బడ్జెట్‌ను భారీగా పెంచారు. యూనివర్సిటీల మధ్య సహకారం కోసం 'అకడమిక్ కోఆపరేషన్ ఫోరమ్' ఏర్పాటు చేయడం ద్వారా నేటితరం విద్యార్థులకు, పరిశోధకులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు లభించనున్నాయి.



వ్యవసాయ రంగంలో ఇజ్రాయెల్ టెక్నాలజీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికే భారత్‌లో నడుస్తున్న 43 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల సంఖ్యను ఏకంగా 100కు పెంచాలని నిర్ణయించడం మన రైతన్నలకు శుభవార్త. 'విలేజెస్ ఆఫ్ ఎక్సలెన్స్'ల ద్వారా ఆధునిక సాగు పద్ధతులను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లనున్నారు. నీటి యాజమాన్యం, కొత్త రకం వంగడాల అభివృద్ధిలో ఇజ్రాయెల్ సహకారం భారత్ ఆహార భద్రతకు వెన్నుముకగా నిలవనుంది. ముఖ్యంగా భవిష్యత్ వ్యవసాయ అవసరాలను తీర్చేలా కొత్త టెక్నాలజీలను సంయుక్తంగా అభివృద్ధి చేయడంపై మోదీ ప్రత్యేక దృష్టి సారించారు.

భారతీయ యువతకు ఇజ్రాయెల్ ఉద్యోగ గమ్యస్థానంగా మారుతోంది. రాబోయే ఐదేళ్లలో ఐటీ, నిర్మాణ, తయారీ, సేవా రంగాల్లో మరో 50 వేల మంది భారతీయులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇప్పటికే 42 వేల మందికి పైగా నిపుణులు అక్కడ స్థిరపడగా, కొత్తగా కుదిరిన మానవ వనరుల నియామక మార్గదర్శకాలు ఈ ప్రక్రియను మరింత పారదర్శకం చేయనున్నాయి. దీనివల్ల మన దేశ యువతకు అంతర్జాతీయ పని అనుభవం దక్కడమే కాకుండా, దేశానికి విదేశీ మారక ద్రవ్యం కూడా పెరగనుంది. రక్షణ రంగంలో భారత్, ఇజ్రాయెల్‌ల బంధం కేవలం విక్రేతకొనుగోలుదారు సంబంధం నుంచి 'మేక్ ఇన్ ఇండియా' భాగస్వామ్యానికి మళ్లింది. గత ఏడాది కుదిరిన ఎంఓయూను మరింత పటిష్టం చేస్తూ, అత్యాధునిక రక్షణ పరికరాల తయారీలో కలిసి ముందుకు సాగనున్నారు. పౌర అణు ఇంధనం, అంతరిక్ష పరిశోధనల్లోనూ ఇరుదేశాల శాస్త్రవేత్తలు కలిసి పనిచేయడం వల్ల భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ తిరుగులేని శక్తిగా ఎదగనుంది. ఈ వ్యూహాత్మక రక్షణ సహకారం ప్రాంతీయ భద్రతకు, అంతర్జాతీయ శాంతికి దోహదపడుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

పశ్చిమాసియాలో శాంతి స్థాపన కోసం గాజా శాంతి ప్రణాళికకు భారత్ తన సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంగీకరించబోమని, దానిని ఉమ్మడిగా ఎదురిస్తామని ఇరుదేశాలు స్పష్టం చేశాయి. ఐఎంఈసీ, ఐ2యూ2 వంటి బహుపాక్షిక కూటముల ద్వారా ప్రాంతీయ అనుసంధానతను పెంచడం వల్ల ఆర్థిక ప్రయోజనాలు కలగనున్నాయి. ఉగ్రవాదంపై పోరులో రాజీపడబోమని, మానవత్వం బాధింపబడని రీతిలో శాంతి చర్చలు జరగాలని మోదీ పిలుపునిచ్చారు. ఇది గ్లోబల్ సౌత్ దేశాల ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఉంది.

ప్రధాని మోదీకి ఇజ్రాయెల్ అత్యున్నత పురస్కారమైన 'స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ మెడల్'ను ప్రదానం చేయడం భారతీయులందరికీ గర్వకారణం. ఇది 140 కోట్ల మంది భారతీయుల పట్ల ఇజ్రాయెల్ ప్రజలకు ఉన్న గౌరవానికి చిహ్నమని మోదీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ మాట్లాడుతూ, భారతీయుల మేధస్సు, ఇజ్రాయెలీల సృజనాత్మకత కలిస్తే అసాధ్యమైనది ఏదీ లేదన్నారు. ఈ పర్యటన వల్ల రెండు దేశాల మధ్య దౌత్యపరమైన దూరం తగ్గడమే కాకుండా, ప్రజల మధ్య సంబంధాలు కూడా బలోపేతం కానున్నాయి.

మొత్తంగా చూస్తే, ప్రధాని మోదీ జెరూసలెం పర్యటన భారత్‌ఇజ్రాయెల్ సంబంధాల్లో ఒక సువర్ణ అధ్యాయం. గుజరాత్‌లోని లోథాల్‌లో నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ అభివృద్ధి నుంచి సైబర్ సెక్యూరిటీ వరకు ఇరుదేశాలు కుదుర్చుకున్న ఒప్పందాలు వికసిత భారత్ లక్ష్యానికి ఊతమిస్తున్నాయి. కొత్త ఆవిష్కరణలు, శాంతి, సుస్థిరత లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రయాణం ఇరుదేశాల యువతకు బంగారు భవిష్యత్తును అందించబోతోంది. అడవిలో విప్లవాలు కాదు, ఆధునిక ప్రపంచంలో టెక్నాలజీ విప్లవాలే నిజమైన అభివృద్ధిని ఈ చర్చలు మరోసారి చాటిచెప్పాయి.

# ఇసుకలో నడకతో ఆరోగ్యం

**ఆరోగ్యమస్తు:**

ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తిని తూచా తప్పకుండా పాటించే వారు నేడు వ్యాయామానికి పెద్దపీట వేస్తున్నారు. మారుతున్న జీవనశైలిలో ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం కోసం జిమ్‌లు, యోగా కేంద్రాల చుట్టూ తిరుగుతుంటారు. అయితే ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన వ్యాయామశాల మన సముద్ర తీరాలు, నదీ గర్భాల్లోని ఇసుక తిన్నెలు. సాధారణంగా గట్టి నేల మీద నడిచే కంటే, ఇసుక మీద నడవడం వల్ల మన శరీరానికి కలిగే ప్రయోజనాలు అపారమని ఆరోగ్య నిపుణులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇది కేవలం ఒక విహారయాత్ర మాత్రమే కాదు, సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమని వారు వివరిస్తున్నారు. ఇసుక మీద అడుగు వేయడం అనేది సాధారణ రహదారిపై నడక కంటే భిన్నమైన అనుభూతిని ఇస్తుంది. ఇసుక స్థిరంగా ఉండకపోవడం వల్ల మనం అడుగు వేసిన ప్రతిసారీ పాదం లోపలికి కుంగిపోతుంది. దీనివల్ల శరీరం తనను తాను నిలదొక్కుకోవడానికి అదనపు శక్తిని ఖర్చు చేయాల్సి వస్తుంది. ఫలితంగా సాధారణ నేలపై నడిచేటప్పుడు ఉపయోగించే కండరాల కంటే, ఇసుకలో నడిచేటప్పుడు పాదాలు, చీలమండలు, పిక్కల కండరాలు దాదాపు 2.1 నుండి 2.7 రెట్లు ఎక్కువ శక్తిని వినియోగిస్తాయి. ఇది కండరాల దృఢత్వానికి ఎంతో దోహదపడుతుంది.



బరువు తగ్గాలని కంకణం కట్టుకున్న వారికి ఇసుక నడక ఒక వరప్రసాదం అని చెప్పవచ్చు. జిమ్ వ్యాయామాల్లో గంటల కొద్దీ గడిపే కంటే, తీరం వెంబడి కొద్దిసేపు నడిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. గట్టి ఉపరితలంపై నడకతో పోలిస్తే, ఇసుకలో నడవడం వల్ల శరీరంలోని క్యాలరీలు 50 శాతం కంటే ఎక్కువగా దహనమవుతాయి. ముఖ్యంగా నడుము చుట్టుకొలతను తగ్గించుకోవాలని భావించే వారికి, పొట్ట భాగంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించడానికి ఈ నడక ఎంతగానో సహకరిస్తుంది. శరీరంలో మెటబాలిజం రేటును పెంచడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణంగా వయసు పైబడిన వారు లేదా కీళ్ల నొప్పులతో బాధపడే వారు నడవడానికి భయపడుతుంటారు. ఎందుకంటే గట్టి నేలపై నడిచినప్పుడు పాదాల మీద పడే ఒత్తిడి మోకాళ్లు, తుంటి కీళ్లపై ప్రభావం చూపుతుంది. కానీ ఇసుక స్వభావసిద్ధంగా మెత్తగా ఉండటం వల్ల, మనం వేసే అడుగుల ప్రభావాన్ని అది తనలో ఇముడ్చుకుంటుంది. దీనివల్ల కీళ్లపై భారం పడదు. వెన్నెముక సమస్యలు ఉన్నవారు కూడా ఇసుకలో నడవడం వల్ల ఉపశమనం పొందుతారని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. కీళ్ల సంరక్షణకు ఇదొక సురక్షితమైన మార్గం.

మనిషి శరీర సమతుల్యత అనేది మెదడు, కండరాల సమన్వయంపై ఆధారపడి ఉంటుంది. ఇసుక ఉపరితలం సమాంతరంగా ఉండదు కాబట్టి, ప్రతి అడుగులోనూ మన మెదడు అప్రమత్తంగా ఉండి శరీరాన్ని బ్యాలెన్స్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ వల్ల శరీరంలోని సూక్ష్మ కండరాలు కూడా ఉత్తేజితం అవుతాయి. పడిపోకుండా ఉండటానికి మన మెదడు చేసే నిరంతర ప్రయత్నం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. వృద్ధులలో తూలి పడిపోయే ప్రమాదాన్ని తగ్గించడానికి, నాడీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇసుక నడక ఒక చక్కని చికిత్సగా పనిచేస్తుంది.

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి ప్రతి ఒక్కరినీ వేధిస్తున్న సమస్య. చల్లని గాలి, పాదాలకు తగిలే మెత్తని ఇసుక స్పర్శ మనసును ప్రశాంతపరుస్తాయి. ప్రకృతితో మమేకం కావడం వల్ల మెదడులో 'ఎండార్ఫిన్' అనే సంతోషాన్నిచ్చే హార్మోన్లు విడుదలవుతాయి. నడుస్తున్నప్పుడు సూర్యరశ్మి ద్వారా లభించే విటమిన్‌డి , స్వచ్ఛమైన గాలి మనలోని ఆందోళనను, ఒత్తిడిని దూరం చేస్తాయి. ఇది ఒక రకమైన 'మెడిటేషన్ ఇన్ మోషన్' వలె మనకు మానసిక ఆరోగ్యాన్ని అందిస్తుంది.

పాదాల అందం, ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారికి ఇసుక నడక ఎంతో మేలు చేస్తుంది. ఇసుక ఒక సహజమైన 'ఎక్స్‌ఫోలియంట్'గా పనిచేస్తుంది. చెప్పులు లేకుండా ఇసుకలో నడిచినప్పుడు, పాదాల అడుగున ఉండే చనిపోయిన చర్మ కణాలను (డెడ్ స్కిన్ సెల్స్) ఇసుక ఘర్షణ ద్వారా తొలగిస్తుంది. దీనివల్ల పాదాలు మృదువుగా, కాంతివంతంగా మారతాయి. రసాయనాలతో కూడిన పెడిక్యూర్ కంటే ప్రకృతి సిద్ధమైన ఈ పద్ధతి ఎంతో శ్రేయస్కరం. పాదాల పగుళ్లను తగ్గించడంలో కూడా ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.

పాదాల అడుగు భాగంలో మన శరీరంలోని వివిధ అవయవాలకు సంబంధించిన నాడీ కేంద్రాలు ఉంటాయి. ఇసుక మీద నడిచినప్పుడు ఆ కేంద్రాలు సున్నితంగా ఒత్తిడికి గురై, శరీరంలోని రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. దీనినే అక్యుప్రెషర్ థెరపీ అని కూడా పిలుస్తారు. ఇసుకలో నడవడం వల్ల పాదాల ఆకృతి కూడా మెరుగుపడుతుంది. ఫ్లాట్ ఫుట్ సమస్య ఉన్నవారు క్రమం తప్పకుండా ఇసుకలో నడిస్తే పాదాలకు కావాల్సిన సహజమైన వంపు ఏర్పడుతుంది. ఇది నడకలో వచ్చే ఇబ్బందులను తొలగించి, నడక శైలిని అందంగా మారుస్తుంది.

నడక కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది మనకు ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తుంది. ఇసుకలో ఉండే లవణాలు, ఖనిజాలు చర్మ రంధ్రాల ద్వారా శరీరానికి స్వల్ప స్థాయిలో అందుతాయని కొందరు ఆరోగ్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వేకువజామున లేదా సాయంత్రం వేళల్లో ఇసుకపై నడవడం వల్ల కళ్లకు కూడా చలవ చేస్తుంది. పట్టణాల్లో కాంక్రీటు జంగిల్ మధ్య నివసించే వారు వారాంతాల్లోనైనా ఇసుక దొరికే ప్రదేశాలకు వెళ్లి ఈ ప్రకృతి సిద్ధమైన వ్యాయామాన్ని అలవరుచుకోవడం శ్రేయస్కరం.చెప్పాలంటే, ఇసుక నడక అనేది ఎటువంటి ఖర్చు లేని, అత్యంత ప్రభావవంతమైన వ్యాయామం. కేవలం శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా, మానసిక వికాసాన్ని కూడా ఇది అందిస్తుంది. అయితే మొదటిసారి ఇసుకలో నడిచేవారు అతిగా శ్రమించకుండా, క్రమంగా సమయాన్ని పెంచుకోవాలి. కండరాలకు అలవాటు అయ్యే వరకు నిదానంగా అడుగులు వేయాలి. ఇలా క్రమం తప్పకుండా ఇసుకపై నడకను అలవాటు చేసుకుంటే, ఆరోగ్యవంతమైన శరీరాన్ని, ప్రశాంతమైన మనస్సును సొంతం చేసుకోవచ్చు. ప్రకృతి ఒడిలో అడుగులేస్తూ పరిపూర్ణ ఆరోగ్యం వైపు పయనిద్దాం.

# పేదల గూడు కూల్చడం ఇందిరమ్మ రాజ్యమా?

**మొదటిపేజీ తరువాయి**

ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారు. ఇక్కడికి వచ్చింది ఏదో పరామర్శించడానికి మాత్రమే కాదని, బాధితుల వెనుక ఒక బలమైన సైన్యంలా బీఆర్ఎస్ ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆశీస్సులతో గెలిచిన ప్రభుత్వం, ప్రజల సొంతింటి కలను చిన్నాభిన్నం చేయడం అత్యంత హేయమైన చర్య అని ఆయన అభివర్ణించారు. యుద్ధ క్షేత్రాన్ని తలపించేలా 4,000 మంది పోలీసుల పహారాలో పేదల ఇళ్లను కూల్చివేయడంపై కేటీఆర్ విస్మయం వ్యక్తం చేశారు. అసలు ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక రాక్షస రాజ్యమా అని సూటిగా ప్రశ్నించారు. శత్రుదేశంపై దండయాత్రకు వెళ్లినట్లుగా సొంత ప్రజలపై పోలీసులను ప్రయోగించడం కాంగ్రెస్ మార్కు పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. పట్టాలు సక్రమంగా ఉన్నప్పటికీ, ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా అర్ధరాత్రి వేళ ఇళ్లను కూల్చడం వెనుక పెద్ద కుట్రే దాగి ఉందని ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న ఈ అరాచకాలను చూస్తూ ఊరుకోబోమని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు శక్తివంతమైన మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులే ఈ మొత్తం ఉదంతానికి సూత్రధారులని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సుమారు 60 ఎకరాల అత్యంత విలువైన భూదాన్ భూములపై ఈ మంత్రుల కన్ను పడిందని, వారి రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం, అక్రమ సంపాదన కోసం పేదలను రోడ్డున పడేశారని మండిపడ్డారు. పేదల గూడును కూల్చి ఆ స్థలంలో మంత్రులు మేడలు కట్టుకోవాలని చూస్తున్నారా అని నిలదీశారు. అధికారులను అడ్డం పెట్టుకుని సాగిస్తున్న ఈ 'భూ' దందాను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే దీనికి తగిన శాస్తి జరుగుతుందని హెచ్చరించారు.

ప్రభుత్వం తన చర్యలు సక్రమమే అని భావిస్తే, ఆ ముగ్గురు మంత్రులు నేరుగా వెలుగుమట్ల బాధితుల వద్దకు వచ్చి సమాధానం చెప్పాలని కేటీఆర్ సవాల్ విసిరారు. తప్పు చేయనప్పుడు భయం ఎందుకని, ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేకనే పోలీసుల చాటున దాక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో మంత్రులకు తెలియదా లేక తెలిసి నటిస్తున్నారా అని ప్రశ్నించారు. పేదల ఉసురు తగిలితే ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, అధికార మదం తలకెక్కిన వారికి కాలమే సమాధానం చెబుతుందని మండిపడ్డారు. ప్రజల పక్షాన నిలబడాల్సిన మంత్రులు, వారిని నిరాశ్రయులను చేయడం దుర్మార్గమని విమర్శించారు.

ఈ ఘటనలో ఒక అధికారిని బలిపశువు చేసి ప్రభుత్వం తప్పించుకోవాలని చూడటం సిగ్గుచేటని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఏ తప్పు జరగనప్పుడు ఆర్డీవోను హుటాహుటిన ఎందుకు బదిలీ చేశారని ఆయన నిలదీశారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమాలకు పాల్పడి, తీరా వివాదం కాగానే వారిపై చర్యలు తీసుకోవడం కాంగ్రెస్ పాత అలవాటేనని విమర్శించారు. అధికారులందరూ కూడా ఆలోచించాలని, రాజకీయ నేతల కోసం నిబంధనలు అతిక్రమిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను కప్పిపుచ్చుకోవడానికి బదిలీల డ్రామాలు ఆడుతోందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధితులకు భరోసా ఇస్తూ, బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో మళ్లీ ఇళ్లు కట్టించి ఇచ్చే పూర్తి బాధ్యత తనదని కేటీఆర్ హామీ ఇచ్చారు. నేడు పేదలు కోల్పోయిన ప్రతి ఇటుకకు రేపు ప్రభుత్వం లెక్క చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. పార్టీ



పరంగా బాధితులకు న్యాయపరమైన సాయం కూడా అందిస్తామని చెప్పారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఈ రోజు అధికారంలో ఉన్నామని విర్రవీగితే రేపు ప్రజలు గుణపాఠం చెబుతారని గుర్తు చేశారు. బాధితులు అధైర్యపడొద్దని, మీ గూడును మీరు దక్కించుకునే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన ఉద్ఘాటించారు. గాంధీజీ పేరు చెప్పుకుంటూ అధికారం చలాయిస్తున్న కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ సెటైర్లు వేశారు. ఒకప్పుడు దేశంలో ఒరిజినల్ గాంధీలు ఉండేవారని, కానీ ఇప్పుడు అంతా డూప్లికేట్ గాంధీలే తయారయ్యారని ఎద్దేవా చేశారు. గాంధీ సిద్ధాంతాలకు తూట్లు పొడుస్తూ పేదల పొట్ట కొట్టడమే ప్రస్తుత కాంగ్రెస్ పాలన అని మండిపడ్డారు. ప్రజలను ప్రేమించడం మానేసి, వారి ఆస్తులను దోచుకోవడమే లక్ష్యంగా ఈ 'డూప్లికేట్ గాంధీలు' వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వీరి నయవంచక రాజకీయాలకు చరమగీతం పాడే రోజు దగ్గరలోనే ఉందని, ప్రజలు అంతా గమనిస్తున్నారని హెచ్చరించారు.

# తెలంగాణలో నకిలీ అధ్యాపకుల దందా

- ప్రభుత్వానికి కోట్లల్లో గండి
- ఓ ప్రజా ప్రతినిధి కళాశాలలో నకిలీల జాతర
- ప్రైవేట్ యాజమాన్యాల మోసం
- సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలి
- సీజేఎస్ అధ్యక్షుడు మాసారం ప్రేమ్ కుమార్ డిమాండ్



**విశాల భారతి, హైదరాబాద్:** తెలంగాణలో కొన్ని ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో విచ్చలవిడిగా నకిలీ అధ్యాపకుల దందా కొనసాగుతోంది. ఈ వ్యవహారం అంతా ప్రభుత్వంలోని ఓ ప్రజా ప్రతినిధి కళాశాలలో జరగడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్మెంట్ రూపంలో వందల కోట్ల రూపాయలను ప్రైవేటు యాజమాన్యాలు తీసుకుంటున్నా.. విద్యార్థులకు చదువు చెప్పడంలో నాణ్యమైన అధ్యాపకులను నియమించకుండా నకిలీ అధ్యాపకులను నియమించి తూ.. తూ మంత్రంగా కళాశాలలను నిర్వహిస్తున్నారు. అఖిలభారత సాంకేతిక విద్య మండలి నిబంధనల మేరకు 1:20 అధ్యాపకులను నియమించడంతోపాటు ఇన్ఫ్రాస్ట్రక్చర్, లేబరేటరీ, లైబ్రరీ ఇతర మౌలిక వసతులను కళాశాలలు ఏర్పాటు చేసుకోకుండా ప్రభుత్వాలను బ్లాక్ మెయిల్ చేస్తూ పోరాటాలు చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. దీని వలన విద్యార్థులు నైపుణ్యాలు లేకుండా ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి

తలంగాణలో శుక్రవారం నుండి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీయూ) అన్ని కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొదలు పెడుతున్నారు. 60 కళాశాలలపైన యూజీసీ, ఏఐసిటికి ఫిర్యాదు చేస్తాను. సరియైన చర్యలు తీసుకోకపోతే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం జరుగుతుంది.

## మహబూబాబాద్ జిల్లా నూతన కలెక్టర్ బాధ్యతల స్వీకారం



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా నూతన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్‌గా డాక్టర్ స్నేహ శబరిష్ గురువారం అధికారికంగా పదవి బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధికారుల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ నూతన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మహబూబాబాద్ మరియు తొర్రూరు ఆర్డీవోలు క్రిష్ణవేణి, గణేష్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై అభినందనలు తెలియజేశారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా అధికారులు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం, బాధ్యతాయుతమైన పాలనకు ప్రాధాన్యత ఇస్తామని నూతన కలెక్టర్ తెలిపారు.

## రజక కుటుంబం పై దాడి దుర్మార్గమైన చర్య

- మట్టపల్లి యాదగిరి రజక సంఘం నాయకులు

**చౌటుప్పల్, విశాలభారతి:** నాగర్ కర్నూల్ జిల్లాలో ఇటీవల రజక కుటుంబం పై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని రజక సంఘం జిల్లా నాయకులు మట్టపల్లి యాదగిరి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ దాడికి పాల్పడిన అగ్రకుల ఎనిమిది మంది మూర్ఖుల ను తక్షణమే ఉరితీయాలని,కనికరం లేకుండా రెండు నెలల చిన్నారిని చంపడం వారి మూర్ఖత్వం నిదర్శనమని,ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారి రజక కుటుంబకి ప్రభుత్వ ఒక కోటి రూపాయలు నష్టపరిహారం ఇచ్చి వారి కుటుంబానికి అండగా ఉండాలని వారిని అన్ని విధాల ఆదుకోవాలని,చౌటుప్పల్ మండల & మున్సిపాలిటీ రజక సంఘం ఆధ్వర్యంలో డిమాండ్ చేయడం జరిగింది.తదనంతరం ప్రాణాలు కోల్పోయిన రజక చిన్నారికి చౌటుప్పల్ వలిగొండ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది.

## ఇర్సులాపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



- డిప్యూటీ డైరెక్టర్ దేశి రామ్ నాయక్

**బయ్యారం విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం ఇర్సులాపురం గ్రామంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డైరెక్టర్ దేశి రామ్ నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన మెనూ, వసతి సదుపాయాలు, పరిశుభ్రత పరిస్థితులను ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్లను సందర్శించి, విద్యార్థులు వినియోగిస్తున్న విధానం గురించి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా సదుపాయాలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న 60 రోజుల యాక్షన్ ప్లాన్పై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాఠశాల ప్రగతిపై డిప్యూటీ డైరెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ బి. శోభన్ బాబు, డిప్యూటీ వార్డెన్ లాలయ్యతో పాటు హీరా సింగ్, శ్రీను, వీరు, కాంతారావు, వాలు, తులసీ దాస్, రవి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## గృహాలు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్



**నిజామాబాద్, విశాలభారతి:** కొత్తపల్లి గ్రామం లో కాంగ్రెస్ కార్యకర్త నవీన్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్మూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి విజయకుమార్ రెడ్డి. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డిని శాలువాతో సత్కరించిన నవీన్ కుటుంబం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాక్లూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవి ప్రకాష్, కొత్తపల్లి సర్పంచ్ భరత్ , గుంజులి సర్పంచ్ గోపెరన్న , పోశెట్టి , గంగాధర్ గౌడ్ , పీర్ సింగ్ , లింగన్న ,చంద్రయ్య, షబ్బీర్, నవీన్ ,సుధాకర్ ,విట్టల్ , వేములపల్లి శ్రీనివాస్ సాయిబాబా రాంబాబు ఆర్మూర్ పట్టణ నాయకులు పవన్ పండిట్ , కౌన్సిలర్ భూపేంద్ర గారు, చిట్టి రెడ్డి , తారక శివకృష్ణ తదిత నాయకులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు గణ స్వాగతం పలికిన బిఆర్ఎస్ శ్రేణులు

**చౌటుప్పల్, విశాలభారతి**:చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఖమ్మం వెలుగుమట్ల బాధితులను పరామశించేందుకు వెళ్తుండగా మార్గం మధ్యలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి చౌటుప్పల్ లో ఆ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చివేయడానికి నిరసిస్తూ బాధితులకు అండగా నిలిచేందుకు ఆయన ఖమ్మం బయలుదేరి వెళ్లారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ స్వీపర్ నెల జీతం రూ. 2 లక్షలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సాధారణంగా సమాజంలో స్వీపర్ అంటే చాలా తక్కువ స్థాయి ఉద్యోగమని, వారి జీతాలు కూడా నామమాత్రంగానే ఉంటాయని ఒక అభిప్రాయం బలంగా ఉంది. ఎవరైనా స్వీపర్‌గా పనిచేస్తున్నారని తెలిస్తే చాలామంది పెదవి విరుస్తారు లేదా చిన్నచూపు చూస్తారు. కానీ, మారుతున్న కాలంతో పాటు ప్రభుత్వ రంగంలో వేతనాల ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఒక స్వీపర్ అందుకునే జీతం వింటే సామాన్యులే కాదు, ఉన్నతాధికారులు కూడా నోరెళ్లబెట్టాల్సిందే. అక్కడ పని తక్కువ స్థాయిదే కావొచ్చు కానీ, నెలాఖరున వారి ఖాతాల్లో జమ అయ్యే మొత్తం మాత్రం ఒక జిల్లా కలెక్టర్ వేతనాన్ని మించిపోతుండటం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విస్మయకరమైన నిజం మరెక్కడో కాదు, సాక్షాత్తు మన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖలోనే చోటు చేసుకుంది. పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీనియర్ ఐఏఎస్ అధికారుల జీతం సగటున రూ. 1.5 లక్షల వరకు ఉంటే, అదే శాఖలో పనిచేస్తున్న ఒక సీనియర్ స్వీపర్ నెల జీతం అక్షరాలా రూ. 2 లక్షల వరకు ఉంది. ఈ విషయాన్ని ఎవరో సామాన్యులు చెప్పిన మాట కాదు, స్వయంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు వెల్లడించిన లెక్కలు. విద్యుత్ సంస్థల్లో వరుసగా జరిగిన వేతన సవరణలు (పీఆర్సీ), ఇతర ప్రయోజనాల కారణంగా ఈ స్థాయి వేతనాలు అందుతున్నాయని ఆయన వివరించారు. ఈ గణాంకాలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో అంటే 2014వ సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల కోసం ప్రభుత్వం నెలకు కేవలం రూ. 1500 కోట్లు మాత్రమే వెచ్చించేది. కానీ, గత పదేళ్ల



కాలంలో ఈ ఖర్చు ఊహించని రీతిలో పెరిగి ప్రస్తుతం ప్రతి నెలా రూ. 6 వేల కోట్లకు చేరుకుంది. అంటే గడచిన దశాబ్ద కాలంలో ప్రభుత్వ ఖజానాపై వేతనాల భారం ఏకంగా 300 శాతం పెరగడం గమనార్హం. రాష్ట్ర ఆదాయంలో సింహభాగం కేవలం జీతాలు, పెన్షన్లు, అప్పుల వడ్డీలకే సరిపోతోందని అధికారులు గణాంకాలతో సహా వివరిస్తున్నారు. ఇది ఒక రకంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై వేతనాల సెగను స్పష్టం చేస్తోంది.

కేవలం విద్యుత్ శాఖలోనే కాకుండా, మున్సిపల్ శాఖలోనూ వేతనాల మోత గట్టిగానే వినిపిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రెగ్యులరైజ్ అయిన శానిటేషన్ వర్కర్లు ప్రస్తుతం సగటున రూ. 70 వేల వరకు జీతం అందుకుంటున్నారు. సుమారు 30 ఏళ్ల సర్వీసు ఉన్న డ్రైవర్లు, పారిశుధ్య సిబ్బందికి లక్ష రూపాయలకు పైగా జీతం లభిస్తోంది. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి జరిగే పేరివిజన్లు, వివిధ సందర్భాల్లో ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు ఈ స్థాయి జీతాలకు ప్రధాన కారణమని తెలుస్తోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఇస్తున్న వేతనాలు అత్యధికంగా ఉండటం విశేషం.

ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న ఈ భారీ వేతన ఆకర్షణే నిరుద్యోగులను ప్రభుత్వ ఉద్యోగాల వైపు పరుగులు తీయిస్తోంది. ఒక్కో నోటిఫికేషన్ పడగానే లక్షలాది మంది దరఖాస్తు చేసుకోవడానికి ప్రధాన కారణం ఇదే. మొన్నటి గ్రూప్1 నోటిఫికేషన్‌లో ఒక్కో పోస్టుకు ఏకంగా 799 మంది పోటీ పడ్డారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కోచింగ్ సెంటర్ల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతూ, ప్రాణం పెట్టి చదువుతున్న నిరుద్యోగుల ఆశయాల వెనుక ఈ ఆర్థిక భద్రత, భారీ శాలరీలే ప్రధాన ఉత్ప్రేరకాలుగా పనిచేస్తున్నాయి. ఉద్యోగ హోదా ఏదైనా సరే, ప్రభుత్వ నౌకరీ ఉంటే చాలు అన్న ధోరణి యువతలో పెరుగుతోంది.

విద్యుత్ సంస్థల్లోని ఉన్నతాధికారుల వేతనాల పరిస్థితి అయితే మరీ ఆశ్చర్యకరంగా ఉంది. అక్కడ పనిచేసే చీఫ్ ఇంజనీర్లు నెలకు రూ. 7 లక్షల వరకు వేతనం అందుకుంటున్నారు. ఇది రాష్ట్ర గవర్నర్ జీతం కంటే కూడా ఎక్కువే కావడం విశేషం. సాధారణంగా ఐఏఎస్ అధికారులకు ఉండే హోదా, అధికారం విభిన్నంగా ఉన్నప్పటికీ, వేతనం పరంగా చూస్తే విద్యుత్ శాఖ ఉద్యోగులు అగ్రస్థానంలో ఉన్నారు. అయితే ఈ భారీ వేతనాలు కేవలం విద్యుత్ శాఖలోని సంస్కరణలు, అక్కడ అమలవుతున్న ప్రత్యేక వేతన సవరణల వల్లే సాధ్యమవుతున్నాయి. అన్ని శాఖల్లోని స్వీపర్లకు ఇవే జీతాలు వర్తించవు అన్నది గమనించాల్సిన విషయం. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కరువు భత్యం (డీఏ) ప్రాథమిక వేతనంలో 33.67 శాతంగా ఉంది. వివిధ గ్రూపుల వేతన వివరాలను పరిశీలిస్తే.. గ్రూప్1 అధికారులు రూ. 80 వేల నుండి రూ. 1.5 లక్షల పైచిలుకు, గ్రూప్2 ఉద్యోగులు రూ. 60 వేల నుండి రూ. 1.2 లక్షల వరకు అందుకుంటున్నారు. కింది స్థాయి గ్రూప్4 ఉద్యోగులకు కూడా ఎంట్రీ లెవల్‌లో రూ. 35 వేల నుండి రూ. 50 వేల వరకు వేతనాలు లభిస్తున్నాయి. ఈ భారీ వేతనాల వల్ల ప్రభుత్వ ఖజానాకు ఇబ్బంది కలుగుతున్నప్పటికీ, రాష్ట్ర తలసరి ఆదాయం దేశంలోనే అగ్రస్థానంలో ఉండటం ప్రభుత్వానికి కొంత ఊరటనిచ్చే అంశం.

రాష్ట్ర ఆదాయంలో సుమారు 45 శాతం వాటా కేవలం వేతనాలకే పోతున్నప్పటికీ, తెలంగాణ జీఎస్‌డీపీ వృద్ధి రేటు 10 శాతం కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. దీనివల్ల ప్రభుత్వం సంక్షేమ పథకాలు, వేతనాల చెల్లింపులను సమర్థవంతంగా నిర్వహించగలుగుతోందని అధికారులు చెబుతున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం వరుసగా చేపట్టిన వేతన సవరణలు ఉద్యోగులకు లాభం చేకూర్చినప్పటికీ, ప్రభుత్వ ఖజానాపై అది దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతోంది. సీఎస్ వెల్లడించిన ఈ వివరాలు ఇప్పుడు పౌర సమాజంలో కొత్త చర్చకు తెరలేపాయి. వేతనాల విషయంలో సమతుల్యత అవసరమనే వాదనలు వినిపిస్తున్నాయి.

సమాజంలో వృత్తిని బట్టి గౌరవించే అలవాటు ఉన్నప్పటికీ, ఇప్పుడు జీతాన్ని బట్టి గౌరవించే రోజులు వచ్చాయి. ఒకప్పుడు స్వీపర్ పని అంటే కేవలం కింది స్థాయి వ్యక్తులు చేసే పనిగా భావించేవారు. కానీ లక్షల్లో జీతం వస్తుందని తెలిసిన తర్వాత, ఆ ఉద్యోగం కోసం కూడా ఉన్నత విద్యావంతులు పోటీ పడుతున్నారు. కేవలం విద్యుత్ శాఖలోనే ఇలాంటి విచిత్రమైన పరిస్థితి ఉండటం, ఐఏఎస్ అధికారుల కంటే కింది స్థాయి సిబ్బంది ఎక్కువ సంపాదించడం అనేది పరిపాలనాపరమైన వైరుధ్యంగా కొందరు భావిస్తున్నారు. ఈ పరిస్థితి ఇతర శాఖల ఉద్యోగులలో కూడా వేతన పెంపుపై ఆశలను రేకెత్తిస్తోంది.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబాబాద్, విశాలభారతి:**

2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్ మరియు నాన్ రెసిడెన్షియల్) పథకం కింద జిల్లాలోని ఉత్తమ ప్రైవేట్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలల ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె. శ్రీనివాసరావు తెలిపారు. అర్హత కలిగిన పాఠశాల యాజమాన్యాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పథకం కింద ఎంపికయ్యే పాఠశాలలు జిల్లా విద్యా అధికారి లేదా పాఠశాల విద్యా డైరెక్టర్ గుర్తింపు పొందినవిగా ఉండాలి. అలాగే పాఠశాలలో మేనేజింగ్ కమిటీ ఉండాలి. గత ఐదు సంవత్సరాల్లో 7వ మరియు 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో కనీసం 90 శాతం ఉత్తీర్ణత సాధించిన రికార్డు ఉండాలి. రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం, వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు ఎస్సీ విద్యార్థుల పట్ల ఎలాంటి వివక్ష లేకుండా సదుపాయాలు అందించాల్సి ఉంటుంది. పాఠశాలలో తగిన అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు ఉండటంతో పాటు కనీసం 50 శాతం బోధనా సిబ్బంది మూడు సంవత్సరాలకు పైగా శాశ్వతంగా పనిచేస్తుండాలి. అలాగే గత సంవత్సరాల్లో ఈ పథకం ద్వారా చేరిన ఎస్సీ విద్యార్థుల్లో కనీసం 50 శాతం మంది 7వ, 10వ తరగతి పరీక్షల్లో మొదటి తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. రెసిడెన్షియల్ పథకం కింద 5వ తరగతి విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్, భోజన సదుపాయాలు,



రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కలిపి ప్రతి విద్యార్థికి రూ.42,000 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. నాన్‌రెసిడెన్షియల్ పథకం కింద 1వ తరగతి విద్యార్థులకు ట్యూషన్, దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కోసం ప్రతి విద్యార్థికి రూ.28,000 చొప్పున ఆర్థిక సహాయం అందించబడుతుంది. దరఖాస్తు ఫారాలు ఫిబ్రవరి 27 నుండి మహబూబాబాద్ సమీకృత జిల్లా కార్యాలయంలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, రెండవ అంతస్తు (గది నం. S17)లో ప్రతి పని దినంలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. పూర్తిగా నింపిన దరఖాస్తులను మార్చి 25 సాయంత్రం 5.00 గంటలలోపు సమర్పించాలని అధికారులు తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన ప్రైవేట్ పాఠశాలలు ఈ పథకం ద్వారా ఎస్సీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే అవకాశాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా అధికారులు కోరారు.

## పిఎం విశ్వకర్మ లబ్ధిదారులకు అవగాహన సదస్సు



**మహబూబాబాద్, విశాలభారతి:** స్థానిక కురవి రోడ్డులోని శ్రీ వీరభద్ర క్రేజీ ఫుడ్ వరల్డ్ వేదికగా ఎం.ఎస్. ఎం.ఈడీఎఫ్ఓ హైదరాబాద్ మరియు జిల్లా పరిశ్రమల కేంద్రం (డిఐసి) మహబూబాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో 'పిఎం విశ్వకర్మ' లబ్ధిదారులకు మరియు దరఖాస్తుదారులకు గురువారం ఒక రోజు అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిశ్రమల కేంద్రం (డి ఐ సి) జనరల్ మేనేజర్ శ్రీమన్నారాయణ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్ డి ఎం) యాదగిరి, మరియు బీసీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస రావు, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. సదస్సులోని ముఖ్యాంశాలు డిజిటల్ మార్కెటింగ్ మారుతున్న కాలానికి అనుగుణంగా తమ ఉత్పత్తులను ఆన్‌లైన్ వేదికల ద్వారా ఎలా విక్రయించాలో లబ్ధిదారులకు వివరించారు. ప్యాకేజింగ్, వస్తువుల నాణ్యతతో పాటు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్ ప్రాముఖ్యతను మరియు మార్కెట్‌లో దానికి ఉన్న డిమాండ్‌ను నిపుణులు వివరించారు. ప్రభుత్వ పథకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతివృత్తుల వారికి అందిస్తున్న వివిధ రకాల రాయితీలు, లోన్ సదుపాయాలు మరియు ఇతర అభివృద్ధి పథకాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిఎం శ్రీమన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ, పిఎం విశ్వకర్మ పథకం ద్వారా చేతివృత్తుల వారు ఆర్థికంగా ఎదగడానికి గొప్ప అవకాశం ఉందని, సాంకేతికతను జోడించి తమ వ్యాపారాలను విస్తరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన విశ్వకర్మ లబ్ధిదారులు, దరఖాస్తుదారులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్

**విశాలభారతి, రామగుండం:**

రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నేపథ్యంలో, మంచిర్యాల పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్ తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద సిబ్బంది బందోబస్త్, పెట్రోలింగ్ చేస్తూ పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పరీక్షా విధుల్లో ఉన్న



సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీపీ వెంట మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ మంచిర్యాల ఏసిపి ఆరు ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోదరావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి సాగునిరందించాలి

- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి



**చౌటుప్పల్ విశాలభారతి:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్లో ఉన్న ఎస్ఎల్బీసి చర్లగూడెం రిజర్వాయర్ను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునిరు అందించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు.చౌటుప్పల్ లో ఓ శుభాకార్యానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన డిండి ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన చర్లగూడెం రిజర్వాయర్ పూర్తయితే వేలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతాయని, రాచకొండలో ఎత్తిపోతల ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా నారాయణపురం, చౌటుప్పల్ మండలాల,రైతులకు అనేక గ్రామాలకు సాగునీరు అందించవచ్చని,భూగర్భ జలాలు పెరిగి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు.ఫ్లోరిన్ పిడిత ప్రాంతాలైన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గలకు సాగు త్రాగు నీటిని కలగ మార్చవద్దని,ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఉద్యమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రభుత్వాలు ఏదో నామమాత్రపు నిధులు కేటాయిస్తున్నారని,అలా కాకుండా వచ్చే బడ్జెట్ లో ప్రాజెక్టు పూర్తయ్యేందుకు సరిపడా నిధులని మంజూరు చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి జిల్లా మంత్రులు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు ప్రత్యేక చొరవ చూపాలని,ప్రాజెక్టు ల సాధన కోసం గతంలో సిపిఐ పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించడం జరిగిందని,మళ్ళీ ప్రజా పోరాటాలకు కూడా వెనకాడబోమని ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సాగునీరందించే వరకు విడతల వారీగా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి,టీఎస్పీఎన్ఎం రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్దె శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, సిపిఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి,ఉడుత రామలింగం,పొట్ట శంకరయ్య,రొండి నర్సింహా,టంగుటూరి రాములు,నర్సింహా,భాస్కర్,దాసరి మనోహర్,బోయ మంకులు తదితరులు ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ట్రాఫిక్ సిఐ

- స్పష్టమైన దృష్టి లేకపోతే జీవితంలో పనులు కష్టతరం
- తిరందాస్ జగన్నాథం లైన్స్ క్లబ్ అధ్యక్షులు




**చౌటుప్పల్, విశాలభారతి:** మానవ శరీరంలో అత్యంత సున్నితమైన,విలువైన అవయవాలలో నేత్రం ఒకటి.స్పష్ట మైన దృష్టి లేకపోతే జీవితంలోని అనేక పనులు కష్టతరంగా మారుతాయని లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా చౌటుప్పల్ అధ్యక్షుడు తిరందాసు జగన్నానాథం అన్నారు. పురపాలిక కేంద్రంలోని వలిగొండ రోడ్డులో గల లయన్స్ క్లబ్ భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సేవ ఆధ్వర్యంలో,ట్రాఫిక్ పోలీస్ సహకారంతో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు,మధుమేహ,రక్తపోటు పరీక్షలను నిర్వహించారు.ఈ శిబిరంను ట్రాఫిక్ సీఐ విజయ్ మోహన్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి కంటి నిపుణులు గుంటోజు సంధ్యా రాణి పర్యవేక్షణలోపరీక్షలు జరిపారు.పుర ప్రజలకు మధుమేహ రక్త పోటు పరీక్షలు జరిపి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అతహర్ పాష, సభ్యులు కాసుల వెంకటేశం, కటికం ప్రశాంత్, కొసనం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం

- జీవితంలో తొలిమెట్టు పదవ తరగతి
- మారేపల్లి మల్లారెడ్డి మల్లికార్జున విద్యాసంస్థల చైర్మన్

**చౌటుప్పల్, విశాలభారతి:** మున్సిపాలిటీ పరిధిలోని మల్లికార్జున ఉన్నత పాఠశాలలో గురువారం రోజున పదవ తరగతి విద్యార్థులుకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్లికార్జున ఉన్నత పాఠశాలల కరస్పాండెంట్ మారేపల్లి మల్లారెడ్డి ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం కరస్పాండెంట్ మల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు 10వ తరగతి జీవితంలో మొదటి మెట్టు అని,పదవ తరగతి అనంతరం విద్యార్థులు క్రమశిక్షణ జీవిత అనుభవంతో మెలగాలని,అలాగే ఉన్నత చదువులు చదివి పాఠశాలకు మరియు పాఠశాల లెవెల్ లో బోధించిన ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని,అలాగే మీరు జీవితంలో ఉన్నత పదవులలో స్థిరపడాలని ఈ సందర్భంగా అయన కోరారు.అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులకు సన్మానాలు చేశారు.ఈ కార్యక్రమంలో మల్లికార్జున స్కూల్ డైరెక్టర్ మారేపల్లి తేజస్విని రెడ్డి,ప్రిన్సిపాల్ కన్నయ్య,ఉపాధ్యాయులు దేవి రావు తదితరులు పాల్గొన్నారు.



# మేయర్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన మహంకాళి స్వామి

**విశాలభారతి, గోదావరిఖని:**

పాలక పక్షం ,ప్రతిపక్షం అనే తేడా లేకుండా అన్ని డివిజన్లలో అందరి సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని రామగుండం శాసన సభ్యులు ఎం . ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. మేయర్ గా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం లోని ఛాంబర్ లో గురువారం మహంకాళి స్వామి పదవీ భాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన సతీ సమేతంగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా , యువజన నాయకుడిగా , కాంగ్రెస్ నాయకుడిగా , కార్పొరేటర్ గా సుదీర్ఘ కాలంగా సేవలందించిన దళిత నాయకుడు మేయర్ గా , కార్మిక నాయకుడు , బి సి నాయకుడు గా ఉన్న సీనియర్ నేత డిప్యూటీ మేయర్ గా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి , మంత్రివర్యులు శ్రీధర్ బాబు ఆశీర్వాదంతో ఎంపికయ్యారని అన్నారు. బొందల గడ్డగా మారిన రామగుండం నగరాన్ని పునర్నిర్మించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్న తమ పై ఎంత దుష్ప్రచారం చేసినా సత్యదూరమైన మాటలను ప్రజలు నమ్మకుండా ఇటీవలి ఎన్నికల్లో అద్భుత ఫలితాలు ఇచ్చారని అన్నారు. త్రాగు నీరు , సాగు నీరు , మౌళిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తుండడంతో పాటు , 1 X 800 మెగా వాట్ల థర్మల్ ప్రాజెక్ట్ తదితర పరిశ్రమలతో పారిశ్రామిక ప్రగతి రామగుండం నగరంలో చురుగ్గా సాగుతున్నదని అన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండి నూతన పాలక వర్గం పని చేయాలని సూచించారు.స్వచ్ఛ రామగుండంగా తీర్చి దిద్దడమే ప్రధాన లక్ష్యమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఎన్నికైన తరువాత తొలిసారిగా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లోని పీఠం పై ఆశీనులై గురువారం పదవీ భాధ్యతలు స్వీకరించారు . ఇంటింటికీ ఉచితంగా పంపిణీ చేయడానికి అంచనా వ్యయం రూ 10.00 లక్షలతో చెత్త డబ్బాలు కొనుగోలు చేయడానికై ప్రవేశపెట్టిన ఫైలు పై తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సానిటేషన్ నిర్వహణలో లోపాలను గుర్తించి ప్రక్షాళన చేయడం చేయడం జరుగుతుందని అన్నారు. రామగుండం నగరంలో కొంతమంది తమ స్వస్థలం లో జనాభా వివరాలు నమోదు చేసుకుంటుండడంతో ఇక్కడ డేటా లో వారి వివరాలు ఉండడంలేదని అన్నారు. తద్వారా నిధుల మంజూరులో నివసిస్తున్న జన సంఖ్య ప్రాతిపదికన రామగుండం నగరానికి నిధులు దక్కడం లేదని అన్నారు.విభాగాల అధికారులు , సిబ్బంది , డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , పలువురు కార్పొరేటర్లు , ప్రతినిధులు , పుర ప్రముఖులు , వివిధ సంఘాల ప్రతినిధులు , ప్రింట్ అండ్ ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు , స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు , వివిధ పార్టీల నాయకులతో పాటు డివిజన్ ప్రజలు తండోప తండలుగా నగర పాలక సంస్థ కార్యాలయానికి తరలివచ్చి మేయర్ కు అభినందనలు తెలిపారు.



# ఎన్ఆర్‌జీఎస్ నిధులతో సీసీ రోడ్డుకు శ్రీకారం

**5 లక్షల వ్యయంతో గ్రామ అభివృద్ధికి నాంది పలికిన సర్పంచ్ ధీరావత్ వీరన్న**

**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా, సీరోల్ మండలం, చింతపల్లి గ్రామంలో గ్రామ అభివృద్ధికి దోహదపడే మరో కీలక పనికి నాంది పలికారు. ఎన్ఆర్‌జీఎస్ (ఉపాధి హామీ పథకం) కింద రూ.5 లక్షల నిధులు మంజూరు కావడంతో, గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ధీరావత్ వీరన్న ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు సంవత్సరాలుగా ఎదురవుతున్న రహదారి సమస్యకు ఈ పనులు శాశ్వత పరిష్కారాన్ని అందిస్తాయని తెలిపారు. వర్షాకాలం లో బురదతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సీసీ రోడ్డు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు జరిపోతుల మహేష్, ఉప సర్పంచ్ తేజావత్ బద్రు, వార్డు సభ్యులు సారమ్మ, అరుణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగించేందుకు ప్రజల సహకారం అవసరమని నాయకులు కోరారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక రవాణా సౌకర్యం మెరుగుపడడంతో పాటు గ్రామ సౌందర్యం కూడా పెరుగుతుందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.



# కోటగిరిలో కార్డెన్ సెర్చ్



**నిజామాబాద్, విశాలభారతి:** కోటగిరి మండల కేంద్రంలోని వినాయక నగర్ కాలనీలో గురువారం పోలీసులు కార్డేన్ సెర్చ్ నిర్వహించారు బోధన్ ఎసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం కార్డెన్ సెర్చ్ ను నిర్వహించారు ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేపట్టారు ద్విచక్ర వాహనాలు ఇతర వాహనాలను పరిశీలించారు వాహనాల పత్రాలను తనిఖీ చేశారు గుర్తు తెలియని వ్యక్తులకు కొత్తవారికి ఎవరు ఆశ్రయం కల్పించవద్దని సూచించారు కొత్తవారు కాలనీలలో సంచరించిన అనుమానాస్పదంగా తిరిగిన వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలి అని సూచించారు ద్విచక్ర వాహనాలను పరిశీలించి అన్ని పత్రాలు తనిఖీ చేశారు ఈ కార్యక్రమంలో రుద్రూర్ బోధన్ రూరల్ పట్టణ సిఐలు కృష్ణ విజయ్ బాబు వెంకటనారాయణ ఎస్సైలు సునీల్ సాయన్న తదితరులు పాల్గొన్నారు

# వెలుగుమట్ల బాధితులకు ఎంపీ రవిచంద్ర భోజనాలు



**ఖమ్మం, విశాలభారతి:** ఖమ్మం నగర శివారు వెలుగు మట్లలోని భూదాన్ బోర్డ్ భూమిలో ప్రభుత్వం తొలగించిన గుడిసెలు, నిరాశ్రాయులైన బాధితుల పరామర్శ కు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఖమ్మం పర్యటనకు విచ్చేశారు.యువనేత కేటీఆర్ కు తమ గోడు వెళ్లబోసుకునేందుకు.. తమకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు వెలుగుమట్ల లో నిరాశ్రయులైన బాధితులు తమ గుడిసెల వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.కేటీఆర్ పర్యటన లో స్వల్ప ఆలస్యం అవ్వడంతో బాధితులంతా ఆకలి, దప్పికతో అలమటిస్తున్నారు. పరిస్థితిని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అప్పటికప్పుడు సుమారు 600 మంది బాధితులకు భోజనాలు, మంచినీటి సదుపాయం కల్పించారు. సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధితులు భోజనాలు లేక అలమటిస్తున్న తరుణంలో ఘటనా స్థలిలో భోజనాలు ఏర్పాటు చేసిన ఎంపీ రవిచంద్రకు ఋణపడి ఉంటామని బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేదల ఉసురు పోసుకున్న కాంగ్రెస్

**పొనిశెట్టి వెంకటేశ్వర్లు**

**పాల్వంచ, విశాలభారతి:**



ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల గ్రామ సమీపంలో పేదల ఇళ్లపై ప్రభుత్వం చేపట్టిన దారుణ చర్యలను బీజేపీ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. వెలుగుమట్లలో పేదలపై జరిగిన దాడి విషయమై ఈ రోజు పాల్వంచలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు స్పందించి ఈ సంఘటనను ఉద్దేశించి మాట్లాడినారు. ఖమ్మం జిల్లా పరిధిలోని ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల గ్రామ సమీపంలో సుమారు పది సంవత్సరాల క్రితం భూదాన్ భూముల్లో దాదాపు 800 పేద కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో అధికారులే ఇంటి నంబర్లు, కరెంటు మీటర్లు, రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం గుర్తించి సౌకర్యాలు కల్పించిన ఇళ్లను ఇప్పుడు అక్రమమని చెప్పడం దారుణం అని మండిపడ్డారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలాది మంది పోలీసులతో, రెవెన్యూ సిబ్బందితో దండెత్తి వెళ్లి జెసిబిలతో పేదల ఇళ్లు నేలమట్టం చేయడం క్రూర మైన చర్య అని అన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఉన్నారని కూడా పరిగణలోకి తీసుకోకుండా వందలాది కుటుంబాలను నడిరోడ్డుపైకి తోసేయడం అమానుషమని అన్నారు. ఎన్నికల ముందు "అభయ హస్తం" అంటూ పేదల ఓట్లు కోరిన కాంగ్రెస్, ఇప్పుడు "భస్మాసుర హస్తం"గా మారి అదే పేదల గూటిని కాల్చేస్తోందని, పేదల పరిరక్షణ పేరుతో రాజకీయాలు చేసే వామపక్ష పార్టీలు కూడా ఈ దారుణంపై మౌనంగా ఉండడం ప్రజలు గమనిస్తున్నారు అని అన్నారు. పేదల కన్నీళ్లు కార్చిన ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారు అని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగగిరి వెంకట్రామామయ్య,మాలోత్ ప్రశాంత్,శేఖర్,కొత్తపల్లి విజయ్, బానోత్ బాలాజీ,రాజా లు పాల్గొన్నారు.

# రైతులకు ఊరటనిచ్చిన చెరువు పునరుద్ధరణ



**విశాలభారతి, పాలకుర్తి:** పాలకుర్తి గ్రామంలో ఉరి చెరువులో కొంతకాలంగా నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ వెంటనే స్పందించారు. సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్న పరిస్థితిని గమనించిన ఆయన, సంబంధిత శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి, ఎస్ ఆర్ ఎస్ పి కెనాల్ ద్వారా పాలకుర్తి చెరువుకు నీరు విడుదల చేయించేలా చర్యలు తీసుకున్నారు.ఎమ్మెల్యే చొరవతో చెరువు నిండిపోవడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. నీరు చేరడంతో వందల ఎకరాల్లో సాగు కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. గ్రామ రైతులు, ప్రజలు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా గురువారం మనాలి ఠాకూర్ చెరువు పునరుద్ధరణ సందర్భంలో ఉరి చెరువు వద్దకు వెళ్లి పసుపు, కుంకుమ, పూలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. అదేవిధంగా, భవిష్యత్తులో కూడా సాగునీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారాల కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెరువు నిండడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఆనందం వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



**అశ్వాపురం, విశాలభారతి :** మండలంలోని రామచంద్రాపురం గ్రామపంచాయతీలో గల సత్యన్నారాయణ పురం గ్రామంలో ఓ ఇందిరమ్మ లబ్ధిదారుడు నిర్మాణం పూర్తి చేసుకొన్న ఇందిరమ్మ ఇంటిని గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం కుటుంబికలతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు అందించడమే లక్ష్మన్నారు. పంచాయతీలోని ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిర్మాణాలను త్వరతిగతిన పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంత వేగంగా నిర్మాణాలు చేపట్టుకుంటే అంతే వేగంగా బిల్లులు కూడా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. రానున్న కాలంలో మరింత మంది అర్హులకు ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూరెడ్డి స్వాతి, ఎంపీడీవో ముత్యాలరావు, హౌసింగ్ డి ఈ సబయ్ రామ్, ఏ పీ ఓ సీతారామయ్య, ఏ ఈ ఉదయ్ కుమార్, విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ మణిదీప్, అశ్వాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి బిక్కమయ్య, నాయకులు ఓరుగంటి రమేష్ బాబు, బూరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# రైతులకు ఊరటనిచ్చిన చెరువు పునరుద్ధరణ

**విశాలభారతి, పాలకుర్తి:** పాలకుర్తి గ్రామంలో ఉరి చెరువులో కొంతకాలంగా నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ వెంటనే స్పందించారు. సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్న పరిస్థితిని గమనించిన ఆయన, సంబంధిత శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి, ఎస్ ఆర్ ఎస్ పి కెనాల్ ద్వారా పాలకుర్తి చెరువుకు నీరు విడుదల చేయించేలా చర్యలు తీసుకున్నారు.ఎమ్మెల్యే చొరవతో చెరువు నిండిపోవడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. నీరు చేరడంతో వందల ఎకరాల్లో సాగు కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. గ్రామ రైతులు, ప్రజలు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా గురువారం మనాలి ఠాకూర్ చెరువు పునరుద్ధరణ సందర్భంలో ఉరి చెరువు వద్దకు వెళ్లి పసుపు, కుంకుమ, పూలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. అదేవిధంగా, భవిష్యత్తులో కూడా సాగునీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారాల కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెరువు నిండడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఆనందం వ్యక్తం చేశారు.



# క్రమం తప్పకుండా గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

**శ్రీమంతాల కార్యక్రమంలో సూపర్వైజర్ స్వప్న**



**అశ్వాపురం, విశాల భారతి:** అంగన్వాడీ కేంద్రాలలో ఇస్తున్న పౌష్టిక ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవడం వలన గర్భిణీలకు ఎంతో మేలు జరుగుతుందని ఐసిడిఎస్ అశ్వాపురం సెక్టార్ సూపర్వైజర్ స్వప్న అన్నారు. గురువారం సెక్టార్ లోని చంద్రబాబు నగర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన శ్రీమంతాల కార్యక్రమంలో ఆమె పాల్గొని గర్భిణీలకు శ్రీమంతాలను చేశారు. ఈ సందర్భంగా గర్భవతులు తీసుకోవలసిన వివిధ రకాల పౌష్టికాహారాలను అంగన్వాడి టీచర్ కే జ్యోతి ప్రదర్శనగా ఉంచారు. అనంతరం గర్భవతులకు శ్రీమంతాలను చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ గర్భిణీలు అంగన్వాడీ కేంద్రాలకు విధిగా హాజరవుతూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అదేవిధంగా కేంద్రాలలోని టీచర్లు ఇస్తున్న సలహాలు సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకొని సుఖప్రస్తావానికి బాటలు వేసుకోవాలి అన్నారు. గర్భస్థ సమయంలో పౌష్టికాహార లోపం జరిగితే గర్భిణీలు ఇబ్బందులు పడే పరిస్థితులు ఎదురవుతాయన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు మెరుగైన పౌష్టికాహారాన్ని అలాగే ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా కేంద్రాలలో పప్పు ఆకుకూరలతో కూడిన భోజనంతోపాటు పాలు, గుడ్లను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లగూడెం పంచాయతీ కార్యదర్శి శ్రావ్య, వార్డు సభ్యురాలు రాజేశ్వరి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

# రూ. 54 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా






**రాజేంద్రనగర్, విశాలభారతి :**

నెక్నాంపూర్‌లో కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు రక్షించారు. ప్రజావసరాల కోసం కేటాయించిన 2700 గజాల స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడి, దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ భూమి విలువ సుమారు రూ. 54 కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నెక్నాంపూర్ గ్రామంలోని 31వ సర్వే నంబరులో 59.14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని 2002లో సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం కేటాయించింది. అనంతరం 2007లో ప్రభుత్వ అనుమతితో హుడా లేఔట్ రూపొందించారు. ప్లాట్ల కేటాయింపు తరువాత ఇళ్ల నిర్మాణం జరిగింది. లేఔట్ ప్రకారం 2700 గజాల స్థలాన్ని పార్క్ మరియు ఇతర ప్రజావసరాల కోసం కేటాయించారు. అయితే గుట్టలా ఉన్న ఈ స్థలం అభివృద్ధి చెందకపోవడంతో కొందరు కబ్జాదారులు దానిపై కన్నేశారు. సచివాలయ ఉద్యోగుల కాలనీలోని పార్క్ మరియు ప్రజావసరాల స్థలాన్ని ప్లాట్లుగా మార్చి విక్రయించే ప్రయత్నాలు జరిగాయి. ఇంకా అనుమతి ఒకచోట తీసుకుని నిర్మాణం మరొకచోట చేపట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. సమీపంలోని వెంకటేశ్వర కాలనీలోని సర్వే నంబరు 22లో ప్లాట్ ఉన్నట్లు చూపించి అనుమతి తీసుకుని, వాస్తవానికి సచివాలయ ఉద్యోగుల కాలనీలోని ప్రజావసరాల స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. పునాదులు వేసి, స్తంభాలు నిర్మించి, స్లాబ్ వేయడానికి సిద్ధమయ్యారు. విషయంపై కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. విచారణలో అక్రమాలు నిర్ధారించబడడంతో హైడ్రా కమిషనర్ శ్రీ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించారు. అదేవిధంగా, గుట్టను ప్లాట్లుగా మార్చి విక్రయించిన మరో ఐదు ప్లాట్లలో నిర్మించిన తాత్కాలిక షెడ్డులను కూడా తొలగించారు. మొత్తం 2700 గజాల ప్రజావసరాల ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, 'పబ్లిక్ స్పేస్' అని సూచించే బోర్డులు ఏర్పాటు చేశారు.

# అంగన్‌వాడీ సిబ్బంది మరింత బాధ్యతతో పని చేయాలి

**సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాయం**




**మణుగూరు, విశాలభారతి :** మండలంలోని మూడు సెక్టార్ల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, సేవల నాణ్యత, మౌలిక వసతుల స్థితిగతులపై గురువారం నాడు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార మెనూ సక్రమంగా అందుతోందా లేదా అన్న అంశంపై సమగ్ర చర్చ జరిగింది. పక్కా భవనాలు, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులపై సమీక్షించారు. కొన్ని కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు లేని విషయం వెల్లడవగా, మరికొన్ని కేంద్రాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న మౌలిక వసతుల లోపాలను ప్రభుత్వం మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధులు మంజూరు చేయించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను అడిగి తెలుసుకుని, లిఖితపూర్వకంగా దరఖాస్తులు అందజేస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన టీచర్లకు ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను అందించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది మరింత బాధ్యతతో పని చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. రోజువారీ నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. నిధులను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలకు మెరుగైన సేవలు అందించేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు.

# శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి ఆలయ పున: ప్రతిష్ట



**పాల్వంచ, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం గుడిపాడు రామచంద్రాపురం గ్రామంలో కాకతీయ కాలంనాటి విశిష్ట చరిత్ర కలిగిన దేవస్థానం శ్రీ మోక్ష వెంకటేశ్వర స్వామి ఆలయ పున: ప్రతిష్ట కార్యక్రమం వేద పండితులచే వేద మంత్రొచ్చారణ నడుమ ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శఠకోపముని జీయర్ స్వామి చేతుల మీదుగా శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ ఎన్.సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ట జీవధ్వజ ప్రతిష్ట శిఖర ప్రతిష్ట గోవింద నామాల స్వరాలతో మారుమోగుతూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రీలంక సుప్రీంకోర్టు న్యాయమూర్తి తురాజ్ రాజాజీ, కొత్తగూడెం స్థానిక శాసనసభ్యులు కోనేని సాంబశివరావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా, మెయర్ మూదు గణేష్, మాజీ మంత్రివర్యులు వనమా వెంకటేశ్వర్లు, ఈఓ రజిని కుమారి, పాల్వంచ ప్రముఖులు మరియు వివిధ రాజకీయ నాయకులు, కార్పొరేషన్ కార్పొరేటర్లు తదితరులు భక్త మహాశయులు అధిక సంఖ్యలో పాల్గొని అంగరంగ వైభవంగా కన్నుల పండుగ గోవింద నామాలతో పూజ కార్యక్రమాలతో ఆలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు.

# నూతన కలెక్టర్‌గా అంకిత్ ఐఏఎస్ పదవీ బాధ్యతలు స్వీకరణ

**భద్రాద్రి, విశాలభారతి:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన జిల్లా కలెక్టర్‌గా అంకిత్, ఐఏఎస్ గురువారం సాయంత్రం 06:19 గంటలకు ఐడీఓసి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో తొలి సంతకం చేసి అధికారికంగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సదర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సిఎండి జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ మరియు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ నూతన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది హాజరై నూతన కలెక్టర్‌కు అభినందనలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జితేష్ వి. పాటిల్ జిల్లా అధికారులను నూతన కలెక్టర్‌కు పరిచయం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా కలెక్టర్‌గా పని చేసే అవకాశం లభించడం తనకు గౌరవంగా మరియు సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకత, ప్రజాహితం ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుని సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ వేగవంతమైన సేవలందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు . జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పడం వంటి అంశాల్లో సమగ్రంగా ముందుకు సాగాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు భద్రాచలం పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం భక్తి వాతావరణంలో జరిగింది. జిల్లాకు తొలిసారిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్‌ను ఇల్లందు క్రాస్ రోడ్‌లో గల సింగరేణి గెస్ట్ హౌస్ వద్ద కొత్తగూడెం ఆర్డీవో మధు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఐడీఓసి కార్యాలయానికి చేరుకుని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# కోనాయపల్లి గ్రామపంచాయతీకి ఇంటర్నెట్

**కేశంపేట,విశాలభారతి:** కేశంపేట మండలపరిధిలోని కోనాయపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ సొప్పరి ధనలక్ష్మి రామక్రిష్ణ ఆధ్వర్యంలో ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఇంటర్నెట్ ద్వారా గ్రామ ప్రజలకు అవసరమైన పంచాయతీ సేవలు మరింత వేగంగా సులభంగా అందుబాటులోకి రానున్నాయన్నారు. ప్రభుత్వ పథకాల వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తులు, ధృవపత్రాల జారీ వంటి పనులు త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంటుందన్నారు.దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# కేఎల్ఆర్ నివాసానికి భట్టి విక్రమార్క

**కుమారుడి వివాహానికి ఆహ్వానం.. నియోజకవర్గ సమస్యలపై చర్చ**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేఎల్ఆర్ నివాసాన్ని సందర్శించారు. ఈ నెల 5వ తేదీన జరగనున్న తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహానికి హాజరుకావాలని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి దంపతులను ఆహ్వానించారు. నార్సింగి నివాసంలో జరిగిన ఈ భేటీలో లక్ష్మారెడ్డి ఉపముఖ్యమంత్రితో కాసేపు సమావేశమయ్యారు. మహేశ్వరం నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన వివరించారు. నిధుల కొరత లేకుండా, విద్యుత్ సమస్యలు లేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవసరమైన సహకారం అందించాలని కేఎల్ఆర్ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కోరారు.

## పునఃప్రాతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న సూర్యనారాయణ గుప్త



**నిజామాబాద్, విశాలభారతి:** సికింద్రాబాద్ జనరల్ బజార్ ప్రాంతంలో సుమారు 400 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ పునఃనిర్మాణం మరియు విగ్రహ పునః ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ కేంద్ర మంత్రివర్యులు జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించడం జరిగింది. పునఃనిర్మాణం అనంతరం ఆలయం మరింత వైభవంగా, శోభాయమానంగా దర్శనమిస్తోంది. భక్తుల భారీ సమక్షంలో జరిగిన ఈ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ "శ్రీ వాసవి అమ్మవారి ఆలయం శతాబ్దాల చరిత్రకు ప్రతీక. ఇలాంటి పురాతన దేవాలయాల పునర్నిర్మాణం మన సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణకు బలాన్నిస్తుంది. ఆలయాలు సమాజ ఐక్యతకు కేంద్రబిందువులు" అని పేర్కొన్నారు. అలాగే అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సౌఖ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతి గోడ పోస్టర్ల ఆవిష్కరణ



**బయ్యారం, విశాలభారతి:** బయ్యారం మండల కేంద్రంలో ఫిబ్రవరి 28న ఇల్లందులో నిర్వహించనున్న సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ముగింపు ఉత్సవాలకు సంబంధించిన గోడ పోస్టర్లను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు నాయక్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇల్లందు సింగరేణి గ్రౌండ్‌లో జరగనున్న సేవాలాల్ మహారాజ్ జయంతి ముగింపు ఉత్సవాలు, శోభాయాత్ర, మహా భోగ్ బండారో మరియు సద్భావన సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. ఇల్లందు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, మేధావులు, ఉద్యోగస్తులు, అధికారులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ప్రజల్లో విస్తరింపజేయడం మరియు సామాజిక ఐక్యతను బలోపేతం చేయడం ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ గోడ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ధరావత్ ప్రేమ్ చంద్ నాయక్, భూక్య నాగేశ్వరరావు నాయక్, భూక్య రవి నాయక్, సాధువు అజ్మీర కళ్యాణ్ నాయక్, భరణి నాయక్, రాజశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

## వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి రైతులతో చర్చలు



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మిర్చి రైతులతో మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ సమావేశమయ్యారు. మార్కెట్‌కు పెద్దఎత్తున మిర్చి తీసుకువస్తున్న రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, వారికి తగిన సూచనలు అందించారు. ధరల స్థిరీకరణ, తేమ శాతం ఆధారంగా న్యాయమైన కొలతలు, తక్షణ చెల్లింపులు వంటి అంశాలపై రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా రైతులు రవాణా సౌకర్యాలు, నిల్వ గిడ్డంగుల కొరత, మధ్యవర్తుల సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన సుధాకర్, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మార్కెట్‌లో పారదర్శక వేలం విధానం అమలు చేసి, రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. మిర్చి దిగుబడులు పెరిగిన నేపథ్యంలో మార్కెట్‌లో రద్దీ ఎక్కువగా ఉండటంతో, తాత్కాలిక షెడ్లు, తాగునీటి సదుపాయం, విశ్రాంతి ఏర్పాట్లు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ పంటను శుభ్రంగా, తేమ తక్కువగా ఉండేలా తీసుకురావాలని సూచించారు. రైతుల సమస్యలను నేరుగా తెలుసుకొని స్పందించినందుకు రైతులు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌లో ఇలాంటి ప్రత్యక్ష సమావేశాలు తరచుగా నిర్వహించాలని కోరారు.

## బయ్యారంలో ముందస్తు చర్యలు



**బయ్యారం, విశాలభారతి:** రాబోయే వేసవిలో గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. బయ్యారం గ్రామ సర్పంచ్ గుగులోత్ శాంతి, కిషన్ నాయక్. ఇటీవల గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో తాగునీటి సమస్యను ప్రజలు ప్రాధాన్యంగా సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామసభలో వచ్చిన సూచనలను గౌరవంగా స్వీకరించిన సర్పంచ్, వేసవికాలంలో నీటి కొరత తలెత్తకుండా ముందుగానే ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న మంచినీటి బావి వద్ద కొత్త మోటారు ఏర్పాటు చేయడంతో పాటు పాత పైప్‌లైన్లను పునరుద్ధరించే పనులను ప్రారంభించారు. ఈ పనులను సర్పంచ్ స్వయంగా పరిశీలిస్తూ, పారిశుధ్య సిబ్బందితో కలిసి వేగంగా పూర్తి చేయిస్తున్నారు. గ్రామ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి. ఈకార్యక్రమంలో ఎలక్ట్రిషియన్ లతీఫ్, శానిటేషన్ సిబ్బంది కంబాల బలయ్య, ఇతర పారిశుధ్య కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది తుపాకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు సర్పంచ్ తీసుకున్న ముందస్తు చర్యలను అభినందిస్తూ, వేసవిలో నీటి సమస్యలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పాఠశాలను తనిఖీ చేసిన బోధన్ సబ్ కలెక్టర్



**నిజామాబాద్, విశాలభారతి:** మండల పరిధిలోని సాలంపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గౌరవనీయులైన బోధన్ సబ్ కలెక్టర్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థులకు నిర్వహిస్తున్న బేస్‌లైన్ మరియు మిడ్‌లైన్ పరీక్షల సరళిని ఆయన క్షుణ్ణంగా సమీక్షించారు. విద్యార్థుల ప్రతిభ పరిశీలన: తనిఖీలో భాగంగా 2వ మరియు 3వ తరగతి చదువుతున్న వర్షిత, గంగ, ప్రసాద్ అనే విద్యార్థుల సమాధాన పత్రాలను గా పరిశీలించారు. విద్యార్థుల భాషా నైపుణ్యాలను మరియు అభ్యసన స్థాయిలను అంచనా వేయడానికి, సబ్ కలెక్టర్ వారిని స్వయంగా పేపర్లు చదవమని కోరారు. విద్యార్థులు చదువుతున్న తీరును గమనించి, వారి విద్యా ప్రమాణాల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూనే, మెరుగుదలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

- **సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు.. డీ ఎస్పీ రవీందర్ రెడ్డి పర్యవేక్షణ**



**మణుగూరు, విశాలభారతి:** మణుగూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను మణుగూరు సబ్ డివిజన్ డీఎస్పీ రవీందర్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక సీఐతో కలిసి కేంద్రాలను సందర్శించిన ఆయన పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయా అనే అంశంపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని, నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. పరీక్షల సమయంలో క్రమశిక్షణకు భంగం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 144 సెక్షన్ అమల్లో ఉందని, అనుమతి లేకుండా గుంపులు గుమికూడకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

# బఫర్ జోన్ పేరుతో పేదలను తరిమేస్తారా...?

- **30 ఏళ్లుగా ప్రహరీ చుట్టు నిర్మాణాలు చేపడుతుంటే ప్లాంట్ యాజమాన్యం చూడలేదా !**
- **సుమారు మూడు దశాబ్దాలుగా ఇండ్లు నిర్మిస్తుంటే అధికారులు ఏం చేశారు**
- **ఇప్పుడు ఇండ్లు తొలగించమంటే నిరుపేదల పరిస్థితి ఏంటి**
- **పేదల జీవితాలతో ఆటలాడుతారా..?**
- **ఇండ్లు తొలగించేందుకు రోజుల్లో డెడ్లైన్ విధించిన అధికారులు**
- **వారికి పునరావాసం కల్పించి గృహాలు తొలగించాలంటున్న పలువురు**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి :**

మండల కేంద్రంలోని గౌతమి నగర్ కాలనీ ప్రహరీ గోడను ఆనుకొని సుమారు 30 ఏళ్లుగా నిరుపేదలు ఇండ్ల నిర్మాణాలు చేసుకుని జీవిస్తుంటే రెవెన్యూ,, ప్లాంట్ అధికారులకు కనిపించలేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు సుమారు నాలుగు దశాబ్దాల సుదీర్ఘకాలం. హెవీ వాటర్ ప్లాంట్ నిర్మాణంతో ఆ కర్మాగారంలో పనిచేసే ఉద్యోగులు నివాసాలు ఉండేందుకు అశ్వాపురం మండల కేంద్రంలో వందలాది ఎకరాల భూములలో



క్వార్టర్లు, నిర్మాణంతో పాటు ఆర్కులు, షాపింగ్ కాంప్లెక్స్ లు, గెస్ట్ హౌస్ లు, హాస్టళ్ళు, పాఠశాలలు, హాస్పిటల్స్, దేవాలయాలు ఇలా అనేకమైన సౌకర్యాలు ఉద్యోగుల కోసం భారజల కర్మాగార యాజమాన్యం చేపట్టింది. నివాసాల చుట్టూ ఆర్‌ఆర్ కట్టుబడి తో ప్రహరీ నిర్మాణాన్ని కూడా చేపట్టింది. అయితే అప్పట్లో ఇక్కడ కర్మాగారాన్ని జీవనాధారంగా చేసుకొని హెవీ వాటర్ ప్లాంట్, గౌతమి నగర్ కాలనీలలో కాంట్రాక్టు పద్ధతిలో పనులు చేసుకునేందుకుని జీవించేందుకు అనేక ప్రాంతాల నుండి మండలానికి వచ్చిన వారు ఉన్నంతకాలం బాడుగ ఇండ్లలో ఉంటూ చివరకు కిరాయిలు చెల్లించలేక ఈ గౌతమి నగర్ కాలనీ పరారీ పక్కన ఖాళీగా ఉన్న స్థలాలలో జీవనం సాగించేందుకు ఎవరికి తోచిన స్థాయిలో వారు చిన్న చిన్న ఇండ్ల నిర్మాణాలు చేపట్టుకుని జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఇలా ఒకటి రెండు రోజులు కాదు ఏకంగా



40 ఏళ్ల కాలంగా జీవిస్తూ కాయకష్టం చేసుకుని అంచలంచెలుగా వారుంటున్న నివాసాలను మెరుగుపరచుకుంటూ వస్తున్నారు. అయితే ఇప్పుడు ఉన్నఫలంగా హెవీ వాటర్ ప్లాంట్, రెవెన్యూ అధికారు లు బఫర్ జోన్ పేరుతో గోడ పక్కన ఉన్న నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని డెడ్లైన్ విధించడం నిరుపేదల జీవనంలో కల్లోలం సృష్టిస్తుంది. ఉన్నపలంగా తమను ఖాళీ చేయమంటే మాకు మరణం తప్ప మరో మరో గతి లేదని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

**40 ఏళ్లుగా అధికారులకు కాలనీ చుట్టున్నది బఫర్ జోన్ అని తెలియదా..?**

అశ్వాపురం మండల కేంద్రంలోని గౌతమినగర్ కాలనీకి దక్షిణ భాగంలో ఉన్న చింతిర్యాల క్రాస్ రోడ్, అలాగే ఉత్తర భాగంలో ఉన్న తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గం పక్కన నిరుపేదల నిర్మాణాలు చేసుకుని ఉంటున్న ఇండ్లు బఫర్ జోన్ లో ఉన్న సంగతి ప్లాంట్ అధికారులకు గానీ స్థానిక రెవెన్యూ వారికి తెలియదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గుడిసెలుగా ఉన్నప్పుడే అక్కడ వారు ఉంటానికి వీల్లేదు ఇది బఫర్ జోన్ అని హెవీ వాటర్ ప్లాంట్ అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు నిబంధనలు పెట్టి ప్రహరీ చుట్టూ నిర్మాణాలు జరగకుండా చూస్తే ఇంత పెద్ద ఎత్తున నష్టం జరిగేది కాదు గాని పలువురు అంటున్నారు. 40 ఏళ్లుగా ఉంటున్నాం కదా అని దాన్నే స్థిర నివాసాలుగా చేసుకొని లక్షల్లో అప్పులు చేసి ఉండే గోడును అక్కా భవనాలుగా నిర్మాణాలు చేపట్టుకుంటే ఇప్పుడున్న ఫలంగా హెవీ వాటర్ ప్లాంట్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వా అనుమతితో స్థానిక రెవిన్యూ అధికారులతో కలిసి నివాసాలను స్వచ్ఛందంగా తొలగించి మమ్మల్ని వెళ్లిపొమ్మని అనడం న్యాయం కాదని అంటున్నారు. అండగా నిలవాల్సిన స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం పేదల పక్షాన నిలబడకుండా లాంటి అధికారులకు సహకరించి తమ బ్రతుకు మీద కొట్టడం ఏందని ఈ ప్రహరీ పక్కన నివాసముంటున్న ప్రజలు ముక్తకంఠంతో ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు తమకు న్యాయం చేకూరేలా చర్యలు చేపట్టి మమ్మల్ని గుండె కోతలు గురికాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే జారే సుడిగాలి పర్యటన

- **రూ.4.85 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**
- **రోడ్లు, ఎస్‌హెచ్‌జీ భవనాలు, ప్రభుత్వ భవనాల పనులు ప్రారంభం**
- **సంక్షేమ పథకాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొనడం**

**అశ్వారావుపేట, విశాలభారతి:**




అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. సుమారు రూ.4 కోట్ల 85 లక్షల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, సంక్షేమ పథకాల పంపిణీ మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం 8 గంటల నుంచే చంద్రుగొండ మండలంలోని బెండాలపాడు, గుర్రంగూడెం, వెంకటయ్య తండా, పోకలగూడెం, గానుగపాడు, రావికంపాడు గ్రామాల్లో పర్యటించి గ్రావెల్ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు, స్వయం సహాయక సంఘాల భవనాల ప్రారంభాలు, ప్రభుత్వ భవనాల కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం తరువాత మద్దుకూరు, దామరచర్ల, చంద్రుగొండ, తిప్పనపల్లి, తుంగారం, రేపల్లెవాడ గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. బూరుగుడేం (యర్రగుంట) గ్రామంలో జరిగిన శ్రీ రామాలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే యర్రగుంట, అన్నపురెడ్డిపల్లి రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన సభల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను స్వయంగా పంపిణీ చేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతరం అన్నపురెడ్డిపల్లిలో బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని భోగ్ భండార్ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## తిరుమలకుంట పాఠశాలలో ఉపాధ్యాయ పదవీ విరమణ సభ ఏర్పాట్లు

- **ఫిబ్రవరి 27న ఘనంగా పదవీ విరమణ కార్యక్రమం**
- **అశ్వారావుపేట–దమ్మపేట విద్యాశాఖ అధికారులు ముఖ్య అతిథులు**
- **27 ఏళ్ల సుదీర్ఘ ఉపాధ్యాయ సేవలకు గుర్తింపు**

**అశ్వారావుపేట, విశాలభారతి:**



అశ్వారావుపేట మండలం తిరుమలకుంట పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన పోరంకి గోవింద రాజు పదవీ విరమణ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 27న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఆత్మీయంగా వీడ్కోలు సభను ఏర్పాటు చేసి ఆయన సేవలను కొనియాడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట, దమ్మపేట మండలాల ముఖ్య విద్యాశాఖ అధికారులు, పీజీహెచ్‌ఎంలు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన అందించిన సేవలను గుర్తు చేస్తూ ఘనంగా సత్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వగ్రామం ఎర్రుపాలెం కాగా, ప్రస్తుతం ఖమ్మంలో స్థిరపడిన గోవింద రాజు కుటుంబంతో నివసిస్తున్నారు. భార్య అరుణ శ్రీతో కలిసి కుటుంబ జీవితం సాగిస్తున్న ఆయనకు ఇద్దరు సంతానం ఉన్నారు. 1998లో ఉపాధ్యాయుడిగా తొలి నియామకం పొందిన ఆయన, మొత్తం 27 సంవత్సరాల సుదీర్ఘ సేవాకాలంలో అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో ఎక్కువ కాలం విధులు నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, మంచి ఫలితాల సాధనలో ఆయన పాత్ర ప్రశంసనీయమని సహచరులు తెలిపారు. 2024లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది తిరుమలకుంట పాఠశాలకు బదిలీపై వచ్చి సేవలందించారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు కోసమే కమిటీ

**సికింద్రాబాద్, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన హామీల అమలు కోసం కమిటీని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమ రథసారథి ఆనాటి జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘాల ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కమిటీ ద్వారా ఉద్యమకారులను గుర్తించడం, వారికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఏ విధంగా అమలు చేయాలి అనే అంశంపై అధ్యయనం చేయడం అంటే అంశాలు ఉంటాయని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి తో చర్చించి కమిటీని ఏర్పాటు చేస్తామని ఉద్యమకారులకు మంత్రి హామీ ఇచ్చారు. ఉద్యమకారులను గుర్తించడంలో ఉద్యమకారుల సంఘాల పాత్ర కీలకంగా ఉండాలని ఆయన సూచించారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ...... ఉద్యమ సంఘాల సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ఈ వినతి పత్రంలో అంశాలను చేర్చమని వెల్లడించారు. కమిటీలో సభ్యులను ఆనాటి ఉద్యమ అనుభవాలు కలిగిన వారితో పాటు ఉన్నతాధికారులను నియమిస్తే పారదర్శకత పాటించే అవకాశం ఉంటుందని అన్నారు. మంత్రికి వినతి పత్రం సమర్పించిన వారిలో తెలంగాణ ఉద్యమకారుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మల్లూరి అనిల్ కుమార్ తెలంగాణ



జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నరసయ్య, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షుడు ప్రపోల్ రామ్ రెడ్డి, ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షుడు సుల్తాన్ యాదగిరి, వివిధ ఉద్యమ సంఘాల నాయకులు పాండు, గొల్లపల్లి నాగరాజు, జానకి రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాయోగిక శిక్షణతో నైపుణ్యాల పెంపు

**విజయవంతంగా ముగిసిన జాతీయ సింపోజియం**



**పాల్వంచ విశాలభారతి:** ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల పాల్వంచలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "కంప్యూటర్ల అసెంబ్లింగ్ మరియు కాన్ఫిగరేషన్‌పై ప్రాయోగిక శిక్షణ" అనే రెండు రోజుల జాతీయ సింపోజియం ఘనంగా ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ పి. పద్మ అధ్యక్షత వహించి ,రెండు రోజుల శిక్షణ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని తెలిపారు. సాంకేతిక నైపుణ్యాలు ఉపాధి అవకాశాలకు దారితీస్తాయని ఆమె పేర్కొన్నారు. అతిథిలుగా వచ్చిన డాక్టర్ ఆర్. వెంకటి హాజరై, విద్యార్థులు నేర్చుకున్న ప్రాయోగిక జ్ఞానాన్ని జీవితంలో ఉపయోగించుకోవాలని సూచించారు. అతిథి డి. భద్రయ్య మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. డాక్టర్ కె. వనజ విద్యార్థులను అభినందించి, సాంకేతిక రంగంలో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఎన్. స్వర్ణజ్యోతి (లెక్చరర్, కంప్యూటర్ సైన్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ, ఆంధ్రప్రదేశ్ నుండి ఆన్లైన్ విధానంలో విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కంప్యూటర్ అసెంబ్లింగ్‌లో ప్రతి భాగం పనితీరును సరిగ్గా అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. మదర్‌బోర్డ్, ప్రాసెసర్, ర్యామ్ అమరికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ సమయంలో డ్రైవర్ సెటప్ మరియు సెక్యూరిటీ అప్‌డేట్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. అదేవిధంగా మరొక రిసోర్స్ పర్సన్ ఎస్. సాంబమూర్తి, కంప్యూటర్ సైన్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల 'ఏ', విశాఖపట్నం , ఆంధ్రప్రదేశ్ మాట్లాడుతూ, ట్రబుల్‌షూటింగ్ నైపుణ్యాలు ప్రతి విద్యార్థికి అవసరమని పేర్కొన్నారు. సాధారణ హార్డ్‌వేర్ సమస్యలను గుర్తించి పరిష్కరించే సామర్థ్యం ఉపాధి అవకాశాలను పెంచుతుందని వివరించారు. ప్రాక్టికల్ అనుభవమే విజయానికి పునాది అని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె మాధవి, డి రమేష్,వేముల కామేశ్వరరావు, టి. అరుణకుమారి,శెట్టి స్వరూప రాణి, పర్వీన్, శ్రీదేవి, సింపోజియం కన్వీనర్ కోటగిరి రాంబాబు, పారెల్లి శ్రీనివాస్, పొట్ల పువ్వు శ్రీనివాసరావు, విమల దీపిక, వెంకటకృష్ణ మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## పట్టణ ప్రకృతి వనాలపై "నిర్లక్ష్యం" నీడ


- **ఎండిపోయిన చెట్లు., పేరుకుపోయిన చెత్తాచెదారం**
- **ఆహ్లాదం పంచని పల్లెప్రకృతి వనాలు**



**మణుగూరు, విశాలభారతి :** తెలంగాణను పచ్చని రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం పథకాన్ని ప్రారంభించి, ప్రతి గ్రామంలో ప్రకృతి వనాలను నిర్మించారు. అయితే ఆచరణలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో సరైన నిర్వహణ లేక పల్లె, పట్టణ వనాల పరిస్థితి అధ్వానంగా మారింది. గ్రామాల్లో జరిగే పండుగలు, సంబురాలకు వేదికగా ఉండాలని భావించి ఏర్పాటుచేసిన పల్లె, పట్టణ ప్రకృతివనాలు నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎండిపోయిన మొక్కలు, చెట్లతో కళావిహీనంగా మారి పల్లెప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించాలన్న లక్ష్యాన్ని వెక్కిరిస్తు న్నాయి. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు, ప్రజలకు విశ్రాంతి వాతావరణం కల్పించేందుకు, చిన్నారులకు ఆటస్థలంగా ఉపయోగపడేందుకు ఏర్పాటు చేసిన ఈ వనాలు ఇప్పుడు శిథిలావస్థకు చేరుతున్నాయి. చెట్లు, పూల మొక్కలు నీటి లేమితో ఎండిపోతుండగా, చుట్టూ పెరిగిన ముళ్లచెట్లు వనాల అందాన్ని మసకబారుస్తున్నాయి. వనాలలో ఏర్పాటు చేసిన ఆట పరికరాలు, బెంచీలు దుమ్ము దూలితో కప్పబడి ఉపయోగించలేని స్థితికి చేరాయి. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోనీ కమలాపురం గ్రామంలో పట్టణ ప్రకృతి వనాలపై పట్టింపు కరువైంది. వనంలో మొక్కల ఆకులు రాలిపోయాయి, ఎండిన మొక్కలు దర్శనమిస్తున్నాయి. పచ్చదనం జాడేలేదు. కొన్ని మొక్కలు చెట్లుగా పెరిగినా వాటికి కావాల్సిన నీరు లేక ఎదగడం లేదు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల పరిస్థితి అధ్వానంగా మారింది.ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కల సంరక్షణకు కావలసిన చర్యలు తీసుకొని ప్రకృతి వనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## దేవాలయంలో ఘనంగా ప్రతిష్ట మహోత్సవ పూజలు

- **పాల్గొన్న కొత్వాల**



**పాల్వంచ, విశాలభారతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ పరిధిలోని గుడిపాడు గ్రామంలో శ్రీ మోక్ష వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్ట మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం పూజారి సింహాద్రి కందాల ఆనందకుమారాచార్యులు,శ్యామల గోపాలన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ సురేష్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, గోదాదేవి సమేత శ్రీ మోక్ష వేంకటేశ్వరస్వామి, గరుడాళ్వార్, విశ్వక్సేన, వకుళాదేవి, జీవధ్వజ (ధ్వజ స్థంభం), ఆలయ శిఖర యంత్ర, ద్వారపాలక, పూర్వక రాజతయంత్ర ప్రతిష్ఠ మహోత్సవాన్నీ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో 9వ డివిజన్ కార్పొరేటర్ చరపా శాంత, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న గౌడ్, డాక్టర్ యుగంధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జమ్ముల సీతారాంరెడ్డి, మిరియాల కమలాకర్, చింతా నాగరాజు, రేనాటి శ్రీనివాసరావు, సున్నం రాజులు, పావని తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**నూతన కౌన్సిలర్లను సన్మానించిన ఎంపీ**

**మొయినాబాద్, విశాలభారతి:**



అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పరితపించే వ్యక్తి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకను గురువారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అంజనీదేవి గార్డెన్ లో ఘనంగా జరిగాయి. ముందుగా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ కూడలిలోని డాక్టర్.బీ.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొయినాబాద్ లోని అంజనీదేవి గార్డెన్ లో నిర్వహించిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో మొయినాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన కౌన్సిలర్లు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ళ మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం మొయినాబాద్ మండల, మున్సిపల్ బీజేపీ నాయకులతో కలిసి ఎంపీతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం మాట్లాడుతూ.. కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని ఇలాంటి మంచి వ్యక్తి చేవెళ్ల ఎంపీగా ఉండడం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ప్రజల అదృష్టమని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తెలిపారు. ఎక్కడ సమస్య ఉన్న పరిష్కరించే కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రజలకు సేవా చేసేంత శక్తి భగవంతుడు ఇవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కొండా మాధవ రెడ్డి ఫౌండేషన్ ద్వారా ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా జన్మదిన సందర్భంగా పేద విద్యార్థులు 2500 రూపాయల చెక్కును 1500 మంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయంగా చెక్కుల పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతరం మున్సిపల్ ఎన్నికలో బీజేపీ పార్టీ నుండి పోటీ చేసి గెలిచిన నూతన కౌన్సిలర్లు షాబాద్ కిషన్, ముదిగొండ ప్రభాకర్ యాదవ్, జగపతి, పడమటి మమతా మోహన్ రెడ్డిలను పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల విశ్వాసాన్ని వమ్ముచేయకుండా ప్రజలకు కౌన్సిలర్లు అందుబాటులో ఉండి మంచిపాలన అందించాలన్నారు. నా జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ మహేశ్వరం ఇన్చార్జి శ్రీరాములు, బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు అంజన్ కుమార్ గౌడ్, కంజర్ల ప్రకాష్, చన్వెల్లి ప్రభాకర్ రెడ్డి, గున్నాల గోపాల్ రెడ్డి, మోర నరసింహారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్, మొయినాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు షాబాద్ కిషన్, ముదిగొండ ప్రభాకర్ యాదవ్, పడమటి మమతా మోహన్ రెడ్డి, జగపతి, బాకారం గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్, శ్రీరామ్ నగర్ సర్పంచ్ ఏర్పుల గీత మహిపాల్, మేడిపల్లి సర్పంచ్ మల్కాపురం శ్రీనివాస్, రెడ్డిపల్లి సర్పంచ్ షాపూరం రాజు, బీజేపీ పార్టీ మొయినాబాద్ మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు మామిడి మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంత రెడ్డి, డాక్టర్. వైభవ్ రెడ్డి బీజేపీ జిల్లా యువ నాయకులు మరియు వివిధ మండలాల సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంతాన సాఫల్య కేంద్రం అందుబాటులోకి రావడం ఆనందకరం

- కేశంపేట మాజీ జెడ్పిటిసి తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి



**కేశంపేట,విశాలభారతి:** షాద్‌నగర్ లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఫెర్టిలిటీ అండ్ ఐవిఫ్ సెంటర్ ఏర్పాటు కావడం, సంతాన సాఫల్యం కోసం పెద్ద పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఆనందకరమని మాజీ జెడ్పిటిసి తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు.గురువారం పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ శారద ఫెర్టిలిటీ అండ్ ఐవిఫ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షాద్‌నగర్ లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన నూతన ఆసుపత్రులు అందుబాటులోకి వస్తుండటం సంతోషదాయకమని,ఇటువంటి వైద్య సంస్థలు మరింతగా అభివృద్ధి చెందాలని ఆశిస్తూ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాంద్ర శ్రవణ్ రెడ్డి,ఆసుపత్రి యాజమాన్యం పాల్గొన్నారు.

## సీఐని కలిసిన బిజెపి నాయకులు



**సికింద్రాబాద్, విశాలభారతి:** వారాసిగూడ పోలీస్ స్టేషన్ కు బదిలీపై వచ్చిన ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్ ను బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి బౌద్ధ నగర్ మున్సిపల్ డివిజన్ అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్, ఇతరు నాయకులు పాల్గొన్నారు.

## వివాహంలో పాల్గొన్న తెలుగు సినీ నిర్మాత



**కూకట్ పల్లి విశాలభారతి:** తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ మున్నూరి కుమార్తెల వివాహం హైదారాబ్ నార్సింగ్ అడ్రస్ కన్వెన్షన్ లో వివాహ వేడుక ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సినీ నిర్మాత, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల పాండురంగ రావు వేడుకలకు హాజరై నవ వధూవరులను ఆశీర్వదించి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

## స్పోర్ట్స్ మీట్‌లో మల్కాజిగిరి పోలీసుల విజయకేతనం



**మల్కాజిగిరి, విశాలభారతి:** సైబరాబాద్ వేదికగా గత వారం రోజులుగా అత్యంత ఉత్సాహంగా జరిగిన 'తెలంగాణ రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్'లో మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి వార్తల్లో నిలిచారు. పట్టుదల, క్రమశిక్షణతో ఆడిన మల్కాజిగిరి పోలీసులు పతకాల పంట పండించారు. ఈ క్రీడా టోర్నీలో మొత్తం 81 పతకాలను కైవసం చేసుకుని, రాష్ట్రస్థాయిలో అత్యధిక మెడల్స్ సాధించిన రెండో కమిషనరేట్‌గా 'ఓవర్ ఆల్ మెడల్స్ విన్నర్' విభాగంలో రన్నరప్‌గా నిలిచి సత్తా చాటారు. మల్కాజిగిరి కమిషనరేట్ సాధించిన ఈ 81 పతకాలలో 23 బంగారు పతకాలు, 35 రజిత పతకాలు మరియు 23 కాంస్య పతకాలు ఉన్నాయి. వివిధ క్రీడా విభాగాల్లో పోలీసు సిబ్బంది చూపిన తెగువ, క్రీడా స్ఫూర్తి అందరినీ ఆకట్టుకున్నాయి. విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసులకు ఇటువంటి క్రీడా పోటీలు శారీరక దారుఢ్యాన్ని, నూతనోత్తేజాన్ని ఇస్తాయని ఈ ప్రదర్శన ద్వారా మరోసారి నిరూపితమైంది. మల్కాజిగిరి కమిషనరేట్ పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టిన క్రీడాకారుల కృషిని అధికారులు, తోటి సిబ్బంది కొనియాడుతున్నారు. ఈ ఘన విజయం సాధించిన క్రీడాకారులను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు పతకాలు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా, మానసిక స్థైర్యాన్ని పెంపొందించడానికి ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన వారు ముమ్ముందు జాతీయ స్థాయి పోటీలలో కూడా రాణించి కమిషనరేట్‌కు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.



# తెలంగాణలో నకిలీ అధ్యాపకుల దందా



- ప్రభుత్వానికి కోట్లల్లో గండి
- ఓ ప్రజా ప్రతినిధి కళాశాలలో నకిలీల జాతర
- ప్రైవేట్ యాజమాన్యాల మోసం
- 70 శాతం పైగా నకిలీ అధ్యాపకులు
- ప్రభుత్వ సెక్రటరీల పర్యవేక్షణ శూన్యం
- అధికారులు బయటకు వెళ్లడం లేదు
- సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలి
- సీజేఎస్ అధ్యక్షుడు మాసారం ప్రేమ్ కుమార్ డిమాండ్

**విశాల భారతి, హైదరాబాద్:**

తెలంగాణలో కొన్ని ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో విచ్చలవిడిగా నకిలీ అధ్యాపకుల దందా కొనసాగుతోంది. ఈ వ్యవహారం అంతా ప్రభుత్వంలోని ఓ ప్రజా ప్రతినిధి కళాశాలలో జరగడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్మెంట్ రూపంలో వందల కోట్ల రూపాయలను ప్రైవేటు యాజమాన్యాలు తీసుకుంటున్నా.. విద్యార్థులకు చదువు చెప్పడంలో నాణ్యమైన అధ్యాపకులను నియమించకుండా నకిలీ అధ్యాపకులను నియమించి తూ.. తూ మంత్రంగా కళాశాలలను నిర్వహిస్తున్నారు. అఖిలభారత సాంకేతిక విద్య మండలి(AICTE)నిబంధనల మేరకు 1:20 అధ్యాపకులను నియమించడంతోపాటు ఇన్ఫ్రాస్ట్రక్చర్, లేబరేటరీ, లైబ్రరీ ఇతర మౌలిక వసతులను కళాశాలలు ఏర్పాటు చేసుకోకుండా ప్రభుత్వాలను బ్లాక్ మెయిల్ చేస్తూ పోరాటాలు చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. దీని వలన విద్యార్థులు నైపుణ్యాలు లేకుండా ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారు.

### ప్రభుత్వం వెంటనే స్పందించాలి

తెలంగాణలో శుక్రవారం నుండి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీయూ) అన్ని కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొదలు పెడుతున్నారు. 60 కళాశాలల పైన యూజీసీ, ఏఐసిటికి ఫిర్యాదు చేస్తాను. సరియైన చర్యలు తీసుకోకపోతే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం జరుగుతుంది.

**మాసారం ప్రేమ్ కుమార్, సీజేఎస్ అధ్యక్షుడు**



## విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలి



**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**విశాల భారతి, భూపాలపల్లి:**

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు . జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పోషకాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. వంట సిబ్బంది పరిశుభ్రతను పాటించడంతో పాటు, ఆహార పదార్థాలు తాజావిగా ఉండేలా చూడాలని, గడువు ముగిసిన పదార్థాలను వినియోగించొద్దని ఆదేశించారు. భోజనం బావుంది ప్రతి రోజు ఇలానే చేయాలని వంట సిబ్బందిని అభినందించారు.

పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషకాహారం అందించడంతో పాటు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తరచుగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా సమతుల ఆహారం అందించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని, విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, విద్యార్థులు మంచి అలవాట్లు అలవరచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, భద్రతా పరమైన చర్యలపై దృష్టి సారించాలని, సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు, ప్రహరీ గోడ పైభాగంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, పాఠశాల ప్రిన్సిపాల్ జీవరత్నం, పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం


**పేదల సొంతింటి కల సాకారం చేస్తామన్న ఎమ్మెల్యే టీ.ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం – శంషాబాద్ మండలంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ఇందిరమ్మ ఇండ్ల" పథకం భాగంగా శంషాబాద్ మండలంలోని మదనపల్లి కొత్త తండా మరియు శంకరాపూర్ గ్రామాల్లో నిర్మాణం పూర్తిచేసుకున్న గృహాలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే తోట ప్రకాష్ గౌడ్ గారు ఈరోజు ఘనంగా ప్రారంభించారు. లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, వారికి ఇంటి తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుపేదలకు సొంత గూడు కల్పించాలనే ఉన్నత ఆశయంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నిజం కావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా, నిజమైన అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సొంత ఇల్లు లభించడంతో లబ్ధిదారులు ఎమ్మెల్యే గారికి మరియు ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, గ్రామ సర్పంచులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## గోలేటి గ్రామంలో రూ.1.5 లక్షలతో వాటర్ ఫిల్టర్ ప్రారంభం

- గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీటి సౌకర్యం
- సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం చిన్న రావిర్యాల పరిధిలోని గోలేటి గ్రామంలో రూ. 1.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ ప్రారంభించారు. గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కూడా హాజరై కార్యక్రమాన్ని అభినందించారు. అలాగే ఈ వాటర్ ఫిల్టర్ ఏర్పాటు కోసం దాతగా నిలిచిన కరెడ్ల వసుమతి ఎల్లారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఇటువంటి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని గ్రామ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సద్దిపల్లి శిరీష శంకర్ రెడ్డి, వార్డు సభ్యులు చెరుకు భాగ్యమ్మ, బండారి సత్యనారాయణ, నా రెడ్డి రిషిత, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గౌరెల్లి గుట్టపై శివాలయంలో రుద్రాభిషేకం

- దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘన ఏర్పాట్లు.. గ్రామ ప్రజలకు విస్తృత ఆహ్వానం




**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** నాగోల్ సర్కిల్ ఎకౌంట్లో డివిజన్ గౌరెల్లి గుట్టపై స్వయంభుగా వెలసిన శివ కేశవుల పుణ్యక్షేత్రంలో ఉన్న శివాలయంలో నేడు 27.02.2026 శుక్రవారం ఉదయం 8.00 గంటల నుంచి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా రుద్రాభిషేకం, రుద్రహోమం మహా పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు తెలిపారు.ఈ పవిత్ర కార్యక్రమం దేవాలయ కమిటీ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతుంది. కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.శ్రీ స్వయంభు స్వర్ణ గిరి లక్ష్మీనరసింహస్వామి మరియు శివాలయ ఆలయ కమిటీ తరపున సమస్త గ్రామ ప్రజలకు, మాజీ ప్రజా ప్రతినిధులకు, గ్రామ పెద్దలకు, మహిళా సంఘాల నాయకులకు, యువజన సంఘాల నాయకులకు, యువకులకు ప్రత్యేక ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి అనుగ్రహం పొందాలని, కార్యక్రమం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.గ్రామ ప్రజలంతా ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేవాలయ కమిటీ కోరారు.ఈ కార్యక్రమాన్ని దేవాలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు, వైస్ చైర్మన్ చెంచాల శ్రీనివాస్, డైరెక్టర్లు నిరుడు రాజు, గ్యార దివ్య దాస్, చెట్టిగారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మూసీ బాధితులకు బీజేపీ భరోసా

- అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మూసీ గోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న బాధితులకు బాసటగా నిర్వహించిన పరామర్శ యాత్రలో ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రీ ఎన్. రామచందర్ రావు గారు, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి గారు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి గారు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి గారు, ఎమ్మెల్సీ కొమురయ్య గారు మరియు ఇతర పార్టీ ముఖ్య నాయకులు కలిసి మధు పార్క్ అపార్ట్‌మెంట్ వాసులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి చెందిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు తీవ్రంగా విమర్శించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ పేరుతో ప్రజలపై అరాచక చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బాధిత కుటుంబాలకు అన్యాయం జరగనివ్వమని, వారికి చట్టపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుమారు 450 ఫ్లాట్లు కలిగిన మధు పార్క్ అపార్ట్‌మెంట్‌తో పాటు బండ్లగూడ జాగీర్ విఘ్నేశ్వర కాలనీ మరియు కేకే కాలనీలలో నివసిస్తున్న సుమారు 100 కుటుంబాలు రోడ్డుపై పడే పరిస్థితి దురదృష్టకరమని పేర్కొన్నారు. వెంటనే ఈ పనులను నిలిపివేసి, నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం ఎంత దూరమైనా వెళ్లి, వారికి నష్టం కలగకుండా పోరాడతామని తెలిపారు. మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్స్ నివాసితుల దయనీయ స్థితి మనసును కలచివేస్తోందని పేర్కొన్నారు. దేశ సేవ చేసిన మాజీ సైనికులు, రిటైర్డ్ ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలు తమ జీవితకాల సంపాదనను వెచ్చించి ఇక్కడ ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. అన్ని చట్టబద్ధ అనుమతులు ఉన్నప్పటికీ రాత్రికి రాత్రే నిబంధనలు మార్చి వారిని అక్రమదారులుగా చిత్రించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ప్రక్రియను పూర్తిగా వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశాల భారతి CINEMA



# అంగరంగ వైభవంగా విజయ్‌రష్మిక వివాహం

విజయ్ దేవరకొండ, రష్మిక మందన వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. ఉదయ్‌పూర్ వేదికగా గురువారం అంగరంగ వైభవంగా జరిగిన కల్యాణంతో వెండితెర సూపర్‌హిట్ జోడీ.. మూడుముళ్ల బంధంలోకి ప్రవేశించింది. కొడవ, తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా వివాహం జరిగింది. 'గీతగోవిందం' చిత్రంతో వారిద్దరి ప్రణయ ప్రయాణం మొదలవగా, 'డియర్ కామ్రేడ్' సినిమాతో వారి ప్రేమ హాట్‌టాపిక్‌గా మారింది. ఏడేండ్ల దోబూచులాటకు తెరదించుతూ విజయ్, రష్మిక తమ బంధాన్ని ప్రపంచానికి పరిచయం చేసుకున్నారు. పెండ్లి ఫొటోలను పంచుకుంటూ 'ప్రాణస్నేహితురాలినే నా భార్యగా చేసుకున్నా' అని విజయ్ ట్వీట్ చేయగా.. 'నా భర్త మిస్టర్ విజయ్ దేవరకొండ' అని రష్మిక పోస్టు చేశారు. 'గీత గోవిందం' వారిద్దరి ప్రణయానికి శ్రీకారం చుట్టింది. అష్టపదుల సాక్షిగా చిగురించిన వలపు బంధం దినదిన ప్రవర్ధమానమై సప్తపదుల వైపు నడిపించింది. వెండితెర సూపర్‌హిట్ జోడీ నిజ జీవితంలో మూడుముళ్ల బంధంతో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. అగ్ర తారలు విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న (విరోష్) వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. గురువారం ఉదయం 10:10 గంటలకు రష్మిక మెడలో విజయ్ దేవరకొండ మూడుముళ్లు వేశారు. కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగిన ఈ పెళ్లి వేడుకకు రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని ఐటీసీ మెమెంటోస్ రిసార్ట్స్ వేదికగా నిలిచింది. రెండు కుటుంబాల సంస్కృతులు, సంప్రదాయాల కలయికగా పెళ్లి ఘట్టాలను నిర్వహించారు. తొలుత తెలుగు సంప్రదాయం ప్రకారం పెళ్లి జరిపించారు. సాయంత్రం నాలుగు గంటలకు కర్ణాటక కొడవ సంప్రదాయంలో పెళ్లి తంతుని నిర్వహించారు. వివాహానంతరం కొత్త జంటకు సోషల్‌మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు నూతన వధూవరులకు ఆశీస్సులు అందించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.